ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
ఆదివారం 3 మార్చి 2024

బోడుమల్లువారిపల్లె మోటు చెరువు నుంచి మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు



చెరువు మట్టిని కొల్లగొడుతున్నారు

- ఎక్స్‌కవేటర్లతో జోరుగా తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు


పీలేరు, మార్చి 2: పీలేరు మండలం బోడుమల్లువారిపల్లె పంచాయతీ పరిధి లోని మోటు చెరువులో రెండు రోజులుగా అక్రమ మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. అక్రమార్కులు చెరువు మట్టిని కొల్లగొట్టి బోడుమల్లువారిపల్లె గ్రామ పరిసర ప్రాంతాల్లోని ఇటుక బట్టీలకు సరఫరా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. నీటి వనరుల్లో పరిమితికి మించి మట్టి తవ్వకాలు జరగకుండా చూడాల్సిన నీటి పారుదల, రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారని, రెండు రోజులుగా ఎక్స్‌కవేటర్లతో మట్టిని తవ్వి టిప్పర్లు, ట్రాక్టర్లతో తరలిస్తున్నారని ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బోడుమల్లువారిపల్లె గ్రామస్తులు వాపోతున్నారు. ఈ విషయమై బోడుమల్లువారిపల్లె ఇన్‌చార్జ్ వీఆర్వో వైవీ రమణ మాట్లాడుతూ మోటు చెరువులో మట్టి తవ్వకాల విషయం తన దృష్టికి రాలేదని, పరిశీలించి చర్యలు తీసుకుంటానని తెలిపారు.

సమరానికి పందెం కోళ్లు సిద్ధం

- జిల్లాలో మూడు నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఖరారు
- ఉత్సాహంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు
- మిగిలిన నియోజకవర్గాలపై తొలగని సందిగ్ధం



మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి



జయ చంద్రారెడ్డి

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమరానికి జిల్లాలో తెలుగుదేశం పార్టీ సగం కోళ్లను (అభ్యర్థులను) ఖరారు చేసింది. ఇంకా సగం స్థానాల్లో అభ్యర్థులెవరో తేల్చాల్సి ఉంది. అయితే ఇప్పటికే సమరానికి సిద్ధమైన కోళ్లతోనే తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంలో ఉన్నారు. ఎలాగైనా రానున్న ఎన్నికల సమరం బరిలో నిలిచే తమ కోళ్లే గెలవాలనే పట్టుదలతో జనంలో తిరుగుతున్నారు. ఇటీవల టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేనాని పవన్‌కళ్యాణ్‌లు ఉమ్మడిగా రాష్ట్ర వ్యాప్తంగా 99 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. ఇందులో జిల్లాలోని తంబళ్లపల్లె, పీలేరు, రాయచోటి స్థానాలను ప్రకటించారు. రాయచోటికి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, పీలేరుకు నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, తంబళ్లపల్లెకు దాసరిపల్లె జయచంద్రారెడ్డిలను అధికారికంగా ప్రకటించారు. దీంతో తెలుగుదేశం పార్టీలో ఉత్సాహం ఉరకలు వేస్తోంది. టికెట్టు దక్కించుకున్న అభ్యర్థులు సైతం ఎన్నికల హడావుడిలో ఉన్నారు. పీలేరు నియోజకవర్గంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డికి టికెట్టు విషయంలో నియోజకవర్గంలో ఎటువంటి పోటీ లేదు. ఆయనే నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జ్. ఈయన ఇప్పటికే ఇంటింటికీ ప్రచారం ప్రారంభించేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా ముఖ్యమైన నాయకులను కలుస్తూ మద్దతు కోరుతున్నారు. పలువురిని టీడీపీలో చేర్చుకుంటూ పార్టీ బలోపేతం చేసుకుంటున్నారు. గత ఎన్నికల్లో ఓటమి చెందినా నియోజకవర్గంలో ప్రజాసమస్యలపై పోరాడుతూనే ఉన్నారు. వైసీపీ నాయకులు చేసిన అనేక భూదందాలను వెలుగులోకి తీసుకొచ్చారు. కొన్ని సంఘటనలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించాయి. దీనికి తోడు దాదాపు సంవత్సర కాలంగా నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు చురుకుగా ఉంటున్నారు. గత ఏడాది ఇదే నెలలో జరిగిన యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ పీలేరు నియోజకవర్గంలో పాదయాత్ర నిర్వహించారు. యువగళాన్ని విజయవంతం చేయడంలో కిశోర్‌కుమార్‌రెడ్డి సఫలీకృతుడయ్యాడనే చెప్పవచ్చు. అంతకుముందు అధికార పార్టీ దౌర్జన్యాలు, అక్రమ కేసులతో నిస్తేజంగా ఉన్న పీలేరు నియోజకవర్గ కార్యకర్తల్లో యువగళం ఊపుతెచ్చింది. ఇదేవిధంగా ఈ ఏడాది జనవరిలో కూడా పీలేరు నియోజకవర్గంలో రా..కదలిరా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం సైతం విజయవంతం అయింది. పై రెండు కార్యక్రమాల నేపథ్యంలో పీలేరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు ఇప్పటికే ఎన్నికల మూడ్‌లో ఉండి.. రాబోయే సమరానికి సిద్ధంగా ఉన్నారని చెప్పవచ్చు.

- రాయచోటి నియోజకవర్గంలో మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జ్ రమేశ్‌కుమార్ రెడ్డి, సుగవాసి ప్రసాద్‌బాబు, మాజీ ఎమ్మెల్యే ద్వారకనాధరెడ్డిలు టికెట్టును ఆశించారు. పార్టీ అధిష్ఠానం మాత్రం మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి వైపు మొగ్గు చూపింది. టికెట్టు దక్కించుకున్న రాంప్రసాద్‌రెడ్డి నియోజకవర్గ వ్యాప్తంగా ముఖ్య నాయకులతో సంప్రదింపులు జరుపుతున్నారు. గతంలో తన తండ్రి నాగిరెడ్డి, బాబాయి నారాయణరెడ్డి హయాంలో తమ కుటుంబం కోసం పని చేసిన నాయకులను కలిసి మద్దతు కోరుతున్నారు. ఇప్పటికే రాజంపేట ఎంపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంతో కలిసి ఎన్నికల గురించి చర్చించారు. చంద్రబాబునాయుడు సమక్షంలో టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబుతో చేయి కలిపారు. మాజీ ఎంపీ, ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడును కలిసి మద్దతు కోరారు. అదేవిధంగా ప్రస్తుతం పట్టణంలోని ముస్లిం నాయకులు, మతపెద్దలతో కలిసి మద్దతు కోరుతున్నారు. ముస్లిం యువతతో చాయ్‌పే.. చర్చా వంటి కార్యక్రమాలతో మాటామంతి కలుపుతూ ఈ సారి తనకు ఓటు వేయమని అభ్యర్థిస్తున్నారు. తనకు మద్దతు ఇస్తున్న పలువురిని పార్టీలోకి చేర్చుకుంటున్నారు. అయితే ఇదే సమయంలో తనకు టికెట్టు రాకపోవడంతో మాజీ ఎమ్మెల్యే రమేశ్‌రెడ్డి పార్టీపైన అలకబూనారు. ఇప్పటి వరకు టీడీపీ ముఖ్య నాయకులతో టచ్‌లోకి రావడం లేదు. ఈయన పార్టీ మారతారనే ఊహాగానాలు జోరుగా ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ తరపున బరిలోకి నిలిచే అవకాశం ఉందని కూడా ఊహాగానాలు ఉన్నాయి. ఎన్నికలకు ఇంకా 45 రోజుల సమయం ఉండడంతో ఏమేమీ జరుగుతాయో వేచి చూడాల్సిందే.

- తంబళ్లపల్లె నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్, పారిశ్రామికవేత్త దాసరిపల్లె జయచంద్రారెడ్డి టికెట్టును ఆశించారు. పార్టీ అధిష్ఠానం జయచంద్రారెడ్డికి టికెట్టును కేటాయించింది. దీంతో శంకర్‌యాదవ్ వర్గం తీవ్రంగా స్పందించింది. జయచంద్రారెడ్డిపై శంకర్‌యాదవ్ వర్గం అధిష్టానానికి ఫిర్యాదు చేసింది. సుమారు 10 బస్సుల్లో శంకర్‌యాదవ్ అనుచరులు విజయవాడకు వెళ్లి చంద్రబాబు గృహం ముందు ఆందోళన చేశారు. దీంతో రెండు మూడు రోజులు తంబళ్లపల్లె అభ్యర్థి ఎవరనే దానిపై సస్పెన్స్ కొనసాగింది. ఎట్టకేలకు జయచంద్రారెడ్డినే తమ అభ్యర్థిగా టీడీపీ అధిష్టానం ప్రకటించింది. అప్పటి నుంచి శంకర్‌యాదవ్ వర్గం స్తబ్దుగా అయిపోయింది. తనకు టికెట్టు ఖరారు కాగానే జయచంద్రారెడ్డి జోరు పెంచారు. నియోజకవర్గ వ్యాప్తంగా ముఖ్య నాయకులను కలుస్తూ మద్దతు కోరుతున్నారు. తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా ఉన్న నాయకులను కలుపుకుని వెళుతున్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఉన్నారు. ఇక్కడ ప్రతిపక్షాలపై నమోదైనన్ని అక్రమ కేసులు, జరిగిన దాడులు జిల్లాలో మరెక్కడా జరగలేదనే చెప్పవచ్చు. ఇటువంటి పరిస్థితుల్లో నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రకు జనం విపరీతంగా వచ్చారు. గత ఏడాది ఆగస్టులో చంద్రబాబు ప్రాజెక్టుల సందర్శన పేరుతో తంబళ్లపల్లె నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా వైసీపీ అల్లరి మూకలు సాక్షాత్తు చంద్రబాబుపైన రాళ్ల దాడికి తెగబడ్డాయి. అది చాలదన్నట్లు చంద్రబాబుతో పాటు వందలాది మంది తెలుగుదేశం పార్టీ నాయకులపై హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. నియోజకవర్గంలోని దాదాపు క్రియాశీల టీడీపీ నాయకులు అందరినీ అక్రమ కేసుల్లో ఇరికించారు. దీంతో సుమారు 45 రోజుల పాటు ఈ నియోజకవర్గంలో టీడీపీ కార్యక్రమాలు స్తంభించిపోయాయనే చెప్పవచ్చు. అధికార పార్టీ ఇంత ఒత్తిళ్లు పెట్టినా కేసుల్లో చిక్కుకుపోయిన టీడీపీ నాయకులు ఎవరూ అధికార పార్టీతో రాజీకి ఒప్పుకోకపోవడం విశేషం. పై రెండు సంఘటనల నేపథ్యంలో నియోజకవర్గంలోని టీడీపీ నాయకుల్లో ఒక రకమైన కసి ఉందని చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో రాబోయే ఎన్నికల సమరానికి మానసికంగా సిద్ధంగా ఉన్న నాయకులు, కార్యకర్తలను భౌతికంగా సిద్ధం చేయడమే జయచంద్రారెడ్డి ప్రధాన కర్తవ్యంగా చెప్పవచ్చు. పై మూడు నియోజకవర్గాల అభ్యర్థులు ఎవరో తేలిపోయినా ఇంకా మదనపల్లె, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో స్పష్టత రావడం లేదు. మదనపల్లె విషయంలో స్పష్టత లేదు. ఇక్కడ టీడీపీ తరపున టికెట్ కోసం చాలామంది పోటీ పడుతుండగా మరోవైపు జనసేన కూడా టికెట్టు ఆశిస్తోంది. బీజేపీ కూడా పొత్తు కుదిరితే తమకు ఇక్కడ టికెట్టు కావాలని అడుగుతోంది. దీంతో ఇప్పటికీ ఇక్కడ అభ్యర్థులు ఎవరో స్పష్టత రావడం లేదు. రాజంపేట నియోజకవర్గంలోనూ టీడీపీలో టికెట్ల కోసం పోటీ తీవ్రంగా ఉంది. ఇదే సీటును జనసేన కూడా ఆశిస్తున్నట్లు పుకార్లు జోరుగా ఉన్నాయి. ఈ కారణంగానే ఇక్కడ అభ్యర్థి ఎంపికపై సస్పెన్స్ కొనసాగుతోంది. ఇక మిగిలిన రైల్వేకోడూరు నియోజకవర్గంలోనూ టీడీపీలో టికెట్టుపై సందిగ్ధం కొనసాగుతోంది. ఈ స్థానాన్ని జనసేన కూడా ఆశిస్తోంది. ఈ నేపథ్యంలో ఇక్కడ కూడా అభ్యర్థి ఎవరనేది ఇంకా తేలలేదు. ఇప్పటికే అనధికారికంగా రాజంపేట పార్లమెంటు అభ్యర్థిగా సుగవాసి బాలసుబ్రమణ్యం పేరు ఖరారు అయిన నేపథ్యంలో.. మిగిలిన మూడు నియోజకవర్గాల్లో కూడా అభ్యర్థులు ఖరారు అయితే రాబోయే ఎన్నికల సమరం రంజుగా ఉంటుందని పలువురు రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు.



పకడ్బందీగా ఓపెన్ స్కూల్ పరీక్షలు : ఆర్జేడీ

రాయచోటిటౌన్, మార్చి 2: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం (ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ) ఆధ్వర్యంలో ఈనెల 18వ నుంచి నిర్వహించనున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కడప ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (ఆర్జేడీ) రాఘవరెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక డైట్ విద్యా కేంద్రంలో పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణలో పాలు పంచుకుంటున్న చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ అధికారులకు సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ ఎటువంటి లోటుపాట్లు జరగకుండా పరీక్షలను నిర్వహించాలన్నారు. డీఈవో శివప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ రెగ్యులర్ విద్యార్థులకు ఉదయం పరీక్ష ఉండగా ఓపెన్ స్కూల్ విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి పరీక్ష ఉంటుందన్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ అధికారులు తమకు కేటాయించిన కేంద్రంలో పరీక్షల నిర్వహణకు అన్ని వసతులు ఉన్నాయా లేవో ఒకసారి చూసుకోవాలన్నారు. జిల్లా ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పదో తరగతి, ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్ పరీక్షలను 16 కేంద్రాల్లో నిర్వహిస్తున్నామన్నారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఓపెన్ స్కూల్ పరీక్షల రాష్ట్ర కో-ఆర్డినేటర్ అక్బర్‌అలీ మాట్లాడుతూ విద్యార్థికి హాల్‌టికెట్‌లో ఏ సబ్జెక్టు అయితే ఉంటుందో అదే సబ్జెక్టు ప్రశ్నాపత్రం జారీ చేయాలన్నారు. వేరే సబ్జెక్టు ప్రశ్నా పత్రం ఇచ్చి పరీక్షలు రాయిస్తే ఫలితాలు నిలిపివేస్తామని తెలిపారు. ఈ విషయమై ఇన్విజిలేటర్లు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. విద్యార్థికి ఏ పరీక్షా కేంద్రం కేటాయించడం జరుగుతుందో అదే పరీక్షా కేంద్రంలో పరీక్షలు రాయాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో కడప ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ సుబ్బారెడ్డి, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జేడీ రాఘవరెడ్డి

రెండోరోజు ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

- 11,756 మంది విద్యార్థులు హాజరు
- విద్యార్థుల హాల్ టికెట్లను తనిఖీ చేసిన డీఐఈవో కృష్ణయ్య

రాయచోటిటౌన్, మార్చి 2: జిల్లావ్యాప్తంగా రెండోరోజు ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలోని 54 పరీక్షా కేంద్రాల్లో 12,364 మంది విద్యార్థులకు గానూ 11,756 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 608 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా రాయచోటి పట్టణంలోని పలు పరీక్షా కేంద్రాల వద్ద డీఐఈవో కృష్ణయ్య విద్యార్థుల హాల్ టికెట్లను తనిఖీ చేశారు. అలాగే పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలపై ఆరా తీశారు. పరీక్షా కేంద్రాల వద్ద బయట వ్యక్తులు ఎవ్వరూ కనిపించకూడదని, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరాదని, మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అలాగే డీఐఈవో కృష్ణయ్య ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని పరీక్షా కేంద్రాలను చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ అధికారులతో పాటు రెండు ఫ్లయింగ్ స్క్వాడ్, రెండు సిట్టింగ్ స్క్వాడ్స్ బృందాల అధికారులు ప్రశాంత వాతావరణంలో పబ్లిక్ పరీక్షలు జరిగేలా పర్యవేక్షించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు పోలీసు అధికారులు, సిబ్బంది గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

వంద శాతం లక్ష్యాలు సాధించాలి

- గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా చూడండి
- పల్స్‌పోలియో విజయవంతం కావాలి
- కలెక్టర్ అభిషిక్త్ కిశోర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్‌కిశోర్

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 2: ప్రభుత్వ పథకాల ప్రగతి సాధనలో వంద శాతం లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం విజయవాడ సీఎం క్యాంపు కార్యాలయం నుంచి రెవెన్యూ, రీసర్వే మూడవ దశ, ఇమామ్, అసైన్డ్ భూములు, నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు, రిజిస్ట్రేషన్స్, గ్రామీణ అభివృద్ధి-ప్రాధాన్యత భవనాలు, ఎన్ఆర్ఈజీఎస్, కరువు మండలాల్లో ఉపాధి పనుల కల్పన, తాగునీరు, పరిశ్రమల శాఖ, ఎంఎస్ఎంఈ క్లస్టర్‌లకు భూమి కేటాయింపు, వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, పల్స్‌పోలియో ఇమ్యూనైజేషన్ కార్యక్రమం తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. సమావేశానికి రాయచోటి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అభిషిక్త్ కిశోర్, డీఆర్వో సత్యనారాయణరావు పాల్గొన్నారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ఆయా ప్రాధాన్యత అంశాల్లో సెక్టార్ వారీగా అభివృద్ధి పనుల్లో పురోగతి సాధించాలన్నారు. ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యం మేరకు జిల్లాలో అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడంలో క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేసి రోజువారీ లక్ష్యాలను చేరుకోవాలన్నారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు, రిజిస్ట్రేషన్‌లను త్వరగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో క్షేత్రస్థాయిలో పరిస్థితులకు అనుగుణంగా మండలాల్లో ఉపాధి పనులు కల్పించాలన్నారు. ముఖ్యంగా కరువు ప్రాంతాల్లో సెల్ఫ్ ఆఫ్ వర్క్స్ రూపొందించుకుని మెట్ట ప్రాంతాల్లో ఫారంపాండ్స్, పెద్ద, చిన్న పర్క్యులేషన్ ట్యాంకుల నిర్మాణం, మినీ అమృత సరోవర్లు నిర్మించడానికి కృషి చేయాలన్నారు. రాబోయే వేసవి కాలంలో నీటి ఎద్దడి రాకుండా ఇప్పటి నుంచి తగిన ప్రణాళికలు రూపొందించుకుని నీటి ఎద్దడి నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిశ్రమలశాఖ ద్వారా ఎంఎస్ఎంఈలకు ఉద్యం రిజిస్ట్రేషన్‌లను త్వరగా పూర్తి చేయాలన్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించి మార్గదర్శకాలను అనుసరించి రబీలో కరువు మండలాల జాబితాను రూపొందించాలన్నారు. జిల్లాలో ప్రాధాన్యత భవనాల లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయండి

ఈనెల 3వ తేదీ జిల్లా వ్యాప్తంగా చేపట్టే పల్స్‌పోలియో కార్యక్రమంలో వందశాతం పిల్లలకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించాలని, కంటి వెలుగు పథకం కింద ప్రభుత్వం నుంచి కంటి అద్దాలు అందగానే లబ్ధిదారులకు వెంటనే పంపిణీ చేయాలని సూచించారు. ఆరోగ్యశ్రీ కార్డులకు ఈకేవైసీని పూర్తి చేసి లబ్ధిదారులందరికీ త్వరితగతిన ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు.

ముందుకు రాని వ్యాపారులు

- మున్సిపాలిటీలో వేలం పాటలు వాయిదా




వేలం పాటలు నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రమీల, ఆర్వో నాగేశ్వరరావు

మదనపల్లె, మార్చి 2: మదనపల్లె మున్సిపాలిటీలో మార్కెట్ల వేలం పాటలకు వ్యాపారులు ముందుకు రాకపోవడంతో శనివారం వాయిదా పడ్డాయి. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం కమిషనర్ కె.ప్రమీల అధ్యక్షతన దినసరిసంత, వారపుసంత, మాంసం మార్కెట్, జంతువధశాల, బెంగళూరు బస్టాండులో గేటు వసూళ్ల వేలం పాటకు అన్నీ సిద్ధం చేశారు. వారం రోజుల క్రితమే వీటికి వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు పత్రికల్లో ప్రకటన జారీ చేశారు. ఏడాది పాటు అంటే ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకూ గేటు వసూళ్లు చేసుకునే హక్కు కల్పిస్తారు. ఇందుకోసం ఇద్దరు వ్యాపారులు మాత్రమే అందులోనూ దినసరి, వారపుసంతకు లీజు దక్కించుకోవడానికి ముందుకొచ్చారు. ఇందులో భాగంగా దినసరి సంత గత ఏడాది రూ.1.30 కోట్లు పోగా ఈ ఏడాదికి రూ.1.09 కోట్లతో కమిషనర్ సర్కారీ పాటగా మొదలుపెట్టగా, ఇద్దరు వ్యాపారులూ ముందుకు రాలేదు. ఇందులో జీఎస్టీ మినహాయించాలని, రూ.కోటి కంటే తక్కువగా వేలంపాట మొదలు పెట్టాలని షరతు పెట్టారు. దీనికి కమిషనర్ అంగీకరించకపోవడంతో వచ్చిన ఇద్దరు కూడా వెనక్కి వెళ్లిపోయారు. ఇక మిగిలిన జంతువధశాల, మాంసం మార్కెట్, బెంగళూరు బస్టాండులో వాహనాల నుంచి గేటు వసూళ్లకు ఎవరూ ముందుకు రాలేదు. ఇందులో మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజ, ఆర్వో నాగేశ్వరరావు, ఆర్ఐలు నాగరాజ, రెడ్డిమస్తాన్ పాల్గొన్నారు.

నీరు పారేదెలా?

- దయనీయంగా పింఛా కాలువలు
- జమ్ము, పిచ్చిమొక్కలతో నిండిన కుడికాలువ



పింఛా ప్రాజెక్టు

సుండుపల్లె, మార్చి 2: జమ్ము, పిచ్చిమొక్కలతో నిండిపోయిన కాలువల ద్వారా నీరు ఎలా పారుతుందని, ప్రాజెక్టుపై అధికారులు చూపుతున్న శ్రద్ధ కాలువలపై కూడా చూపాలని రైతులు కోరుతున్నారు. సుండుపల్లె మండలంలోని ముడుంపాడు సమీపంలో నిర్మించిన యర్రపురెడ్డి ఆదినారాయణరెడ్డి పింఛా ప్రాజెక్టు దిగువ భాగంలో అధికారికంగా కుడి, ఎడమ కాలువల ద్వారా మొత్తం 5 వేల ఎకరాల సాగు భూమికి నీరు అందించగల సామర్థ్యం ఉంది. అయితే ప్రాజెక్టు మట్టికట్ట కొట్టుకుపోవడంతో మూడు సంవత్సరాల నుంచి ప్రాజెక్టు దిగువ భాగంలో ఉన్న రైతులకు సాగునీరు లేక అష్టకష్టాలు పడుతున్నారు. అయితే ప్రాజెక్టు మట్టికట్ట పనులు ఏడాది క్రితం ప్రారంభమయ్యాయి. పనులు జరుగుతున్నాయి. కానీ మూడు సంవత్సరాల నుంచి కుడి, ఎడమ కాలువల్లో నీరు ప్రవహించకపోవడం, కాలువల మరమ్మతులపై అధికారులు దృష్టి సారించకపోవడంతో కాలువలు దయనీయంగా మారాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువల్లో జమ్ము, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. వచ్చే ఏడాది నాటికి ప్రాజెక్టు మట్టికట్ట పనులు పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. పనులు పూర్తయినా కాలువల ద్వారా రైతులకు సాగునీరు అందించలేని పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. కాలువల్లోకి పిచ్చిమొక్కలను తొలగించి జమ్ముతో నిండిపోయిన చోట్ల జమ్మును తొలగించి వ్యర్థపదార్థాలతో నిండిన కాలువను శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు. సుమారు 5 వేల ఎకరాలకు నీరు అందించే కాలువ మరమ్మతులపై దృష్టి సారించాలని, త్వరగా పనులు పూర్తి చేస్తే రైతులకు మేలు జరుగుతుందని స్థానిక నాయకులతో పాటు ప్రతిపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రాజెక్టు దిగువ భాగంలోని పింఛా, పెద్దినేనికాలువ, రాయవరం, మాచిరెడ్డిగారిపల్లె ప్రాంతాలకు పింఛా ప్రాజెక్టు వరప్రసాదం లాంటిది. ఈ ప్రాంతంలో ఎక్కువ భాగం గిరిజన రైతులు భూములు సాగు చేస్తున్నారు. మూడు సంవత్సరాల నుంచి సాగునీరు లేకపోవడంతో భూములు సాగు చేయలేక తినేదానికి తిండి లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా సకాలంలో మట్టి కట్ట పనులు పూర్తి చేసి వచ్చే ఏడాదిలోనైనా కాలువల ద్వారా నీటిని అందించాలని రైతులు కోరుతున్నారు.

కాలువలను సిద్ధం చేస్తాం..

ప్రాజెక్టు మట్టికట్ట పనులు పూర్తయ్యాయి. తెగిపోయిన కాలువ మరమ్మతులు చేస్తున్నాము. పనులు పూర్తి అయిపోయిన వెంటనే కుడి, ఎడమ కాలువ మరమ్మతు పనులను ప్రారంభించేలా చూస్తాము. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తాము. కొన్నిచోట్ల ఎడమ కాలువకు మరమ్మతులు చేయాల్సి ఉంది. మరమ్మతు పనులను సైతం పూర్తి చేసి చివరి ఆయకట్టు రైతుకు నీరు అందేలా చూస్తాము.

- వెంకట్రామయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

పిచ్చిమొక్కలు తొలగించాలి..




కుడి కాలువలో పిచ్చి మొక్కలు తొలగిస్తే రైతులకు నీరు చేరుతుంది. చాలా రోజుల నుంచి నీరు ప్రవహించకపోవడంతో కాలువ మట్టి చెత్తాచెదారంతో నిండిపోయింది. మట్టి, చెత్తాచెదారం వ్యర్థాలను తొలగిస్తే గానీ నీరు రైతులకు అందే పరిస్థితి లేదు. తూములు మరమ్మతులు చేయాలి. చాలాచోట్ల తూములు దెబ్బతిన్నాయి. ఇరువైపులా కాలువ పగిలిపోయింది. ప్రాజెక్టు మట్టి కట్టతో పాటు కాలువ పనులు పూర్తి చేయాలి.

- అమ్మనాయక్, రైతు, ఆరోగ్యపురం



జమ్ము, వ్యర్థాలతో నిండిన కుడికాలువ



పిచ్చిమొక్కలతో ఎడమ కాలువ

చేపలు పడుతుండగా విద్యుత్ షాక్

- కర్ణాటకకు చెందిన యువకుడు మృతి



మృతి చెందిన యువకుడు ఫకీర్

ములకలచెరువు, మార్చి 2: చెరువులో చేపలు పడుతుండగా కరెంటు షాక్‌కు గురై కర్ణాటక రాష్ట్రానికి చెందిన యువకుడు మృతి చెందాడు. గ్రామస్థుల కథనం మేరకు... కర్ణాటక రాష్ట్రం దావనగిరి జిల్లా సుడికేర్‌వనల్లికి చెందిన నాగప్ప కుమారుడు ఫకీర్ (30) ప్రతిరోజూ సహచరులతో కలిసి చేపలు పట్టేందుకు వెళ్తుంటాడు. ఈ క్రమంలో శనివారం చేపలు పట్టేందుకు ములకలచెరువు మండలం మద్దినాయనిపల్లె చెరువులోకి దిగాడు. సహచరులతో కలిసి చేపలు పడుతుండగా కరెంట్ షాక్‌కు గురయ్యాడు. చెరువులో ఉన్న విద్యుత్ స్తంభానికి సంబంధించిన ఎర్త్ వైరు కాళ్లకు తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఇది గమనించిన సహచరులు చికిత్స నిమిత్తం 108 అంబులెన్సులో మదనపల్లె జిలా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచనల మేరకు బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల అభివృద్ధికి కృషి

● యోగివేమన విశ్వవిద్యాలయం వీసీ సుధాకర్



మాట్లాడుతున్న వైవీ యూనివర్సిటీ వీసీ సుధాకర్

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 2: యోగివేమన యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తామని ఆ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ చింతా సుధాకర్ తెలిపారు. శనివారం ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో సూపర్ కంప్యూటర్ ఇన్ హ్యాండ్ కరెంట్, ఫ్యూచర్‌టెన్స్ ఇన్ మొబైల్ షాక్ అన్న అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమలోని వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఉత్తమ కళాశాల అని, కళాశాల అభివృద్ధికి, విద్యార్థులకు వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.నాగరాజు మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి ప్రతి విభాగంలో వర్క్‌షాప్‌లు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల డీన్ ప్రొఫెసర్ కె.వి.రమణయ్య, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సమస్యలు ఉండకూడదు

● ట్రైనీ కలెక్టరు భరద్వాజ్



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టరు

చెన్నూరు, మార్చి 2 : మండలంలోని 36 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ కోసం వచ్చే ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉండకూడదని ముఖ్యంగా విద్యుత్, ఫ్యాన్లు, ర్యాంప్‌లు లాంటి ప్రధాన సమస్యలన్నీ కచ్చితంగా పూర్తి చేయాలని ట్రైనీ కలెక్టరు భరద్వాజ్ సూచించారు. మండలంలోని చెన్నూరుతో పాటు మిగిలిన గ్రామ పంచాయతీల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలన్నింటినీ శనివారం ట్రైనీ కలెక్టరు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 36 కేంద్రాలకు సంబంధించి ఐదు రూట్లు ఏర్పాటు చేశామని, ఏ రూట్‌లో ఎలా ఉండాలి, సిబ్బంది ఎలా వెళ్లాలి, సిబ్బంది విధులు, ఆ రూటు పరిస్థితులన్నింటిని స్థానిక సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రూటుమ్యాప్ తయారు చేసిన మండల కన్వీనరు సోమశేఖర్‌ను పిలిపించి పోలింగ్ కేంద్రాల సరళిని పరిశీలించారు. ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా అందులో ఎండాకాలం వస్తుంది కాబట్టి పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీటికి, ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు పడకూడదన్నారు. అంతేకాక ఆ భవనం కిటికీలు, తలుపులు, చుట్టుపక్కల పరిస్థితులు ఇవన్నీ ఎలాంటి ఇబ్బందికరంగా ఉండకూడదని తెలిపారు. ఆయన వెంట పలువురు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదు

● మహాశివరాత్రి ఉత్సవాలపై పొలతలలో అధికారుల సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో మధుసూదన్

పెండ్లిమర్రి, మార్చి 2: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రమైన పొలతల మల్లికార్జునస్వామి ఆలయంలో ఈనెల 7వ తేదీ నుంచి మూడు రోజుల పాటు మహాశివరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. ఈ ఉత్సవ ఏర్పాట్లపై పొలతల క్షేత్రంలో శనివారం ఆలయ చైర్మన్ అంబటి నాగమల్లారెడ్డి అధ్యక్షతన ఆర్డీవో మధుసూదన్, డీఎస్పీ షరీఫ్ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో, డీఎస్పీలు మాట్లాడుతూ శివరాత్రికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లను కట్టుదిట్టం చేయాలన్నారు. తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ ట్రాఫిక్, క్యూలైన్లు, చలువపందిళ్లను ఏర్పాటు చేయాలని, కోనేర్లను శుభ్రపరచాలని, భక్తులకు వైద్య సౌకర్యాలు కల్పించాలన్నారు. డీఎస్పీ షరీఫ్ మాట్లాడుతూ ఘాట్ రోడ్ల వద్ద పొలతలకు వచ్చే దారి వెంబడి పోలీసుల నిఘా ఉంటుందని, అలాగే ఆలయ పరిసరాలలో సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురి కాకుండా స్వామివారిని దర్శించుకుని పూజలు చేసుకునేందుకు అన్ని వసతులు ఏర్పాటు చేయాలని అన్ని శాఖల అధికారులకు తెలియజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ, సీఐ నాగరాజు, ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, వైద్యాధికారి ప్రసాద్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలను జయప్రదం చేయాలి

సిద్దవటం, మార్చి 2: మండలంలోని వంతాటిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో ఈ నెల 7, 8, 9 తేదీలలో నిత్యపూజకోనలో జరగనున్న మహాశివరాత్రి మహోత్సవాలను ఏ ఆటంకం లేకుండా ప్రశాంతంగా జరిగే విధంగా మండల అధికారులు సమన్వయంతో జయప్రదం చేయాలని కడప ఆర్డీవో మధుసూదన్ పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన సిద్దవటం తహసీల్దారు కార్యాలయంలో శనివారం మహా శివరాత్రి మహోత్సవాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మహాశివరాత్రి మహోత్సవాల్లో నిత్యపూజయ్య స్వామిని దర్శించుకునే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. శివరాత్రి ఉత్సవాల్లో భక్తులకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు మందుల కొరత లేకుండా వైద్య సిబ్బంది చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీసు సిబ్బందికి వివిధ డ్యూటీలు ఉన్న కారణంగా కొరత ఉందని పోలీసులకు మద్దతుగా పంచాయతీరాజ్ శాఖ సిద్దవటం, ఒంటిమిట్ట మండలాల నుంచి వలంటీర్లు, సచివాలయ సిబ్బందిని వినియోగించుకోవాలన్నారు. అటవీ ప్రాంతంలో పార్కింగ్ సౌకర్యానికి, రోడ్డుకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్‌కు అటవీ శాఖ సహకరించాలని రేంజర్ కళావతికి సూచించారు. అలాగే నిత్యపూజకోనలో ఎక్కడ పడితే అక్కడ ప్లాస్టిక్, వ్యర్థ పదార్థాలను వేయకుండా చర్యలు చేపట్టాలన్నారు. కడప డీఎస్పీ షరీఫ్ మాట్లాడుతూ ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వాహనదారులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురాద్‌షావలి, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఒంటిమిట్ట సీఐ పురుషోత్తం రాజు, రేంజర్ కళావతి, ఎస్ఐ పెద్దఓబన్న, నిత్యపూజ ఆలయ చైర్మన్ కొండారెడ్డి, ఈవోపీఆర్డీ పులిరామ్‌సింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేష్, ట్రాన్స్‌కో ఏఈ జయచంద్ర, పంచాయతీరాజ్ ఏఈ సుబ్రమణ్యం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అరటి తోటలు దగ్ధం



కాలిపోయిన అరటితోట

కాశినాయన మార్చి 2: విద్యుత్ తీగల నుంచి నిప్పురవ్వలు ఎగసి పడడంతో వెల్లుర్తి గాయత్రి, భాగ్యమ్మ, మరో రైతుకు చెందిన 12 ఎకరాల అరటి తోటలు కాలిపోయినట్లు బాధితులు తెలిపారు. మంటల్లో డ్రిప్ పైపులు, ఇతర పరికరాలు కాలి బూడిదయ్యాయన్నారు. పోరుమామిళ్ల ఫైర్ సిబ్బందికి సమాచారమందించినా వారు వచ్చేలోపే అరటి తోటలు అగ్నికి ఆహుతయ్యాయని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరారు.

గోడ పడి వ్యక్తి మృతి

కడప (క్రైం), మార్చి 2 : కడప నగరంలోని సాగర్ కాలనీలో శనివారం గోడ పడి వ్యక్తి మృతి చెందినట్లు రిమ్స్ ఏఎస్ఐ యోగేంద్ర తెలిపారు. అయన వివరాల మేరకు... సాగర్ కాలనీకి చెందిన కొమ్మినేని సుదర్శన్ (36) బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి సంబంధించి పాత ఇంటి గోడ ఉంది. దానిని జేసీబీతో ఆ ఇంటిని తొలగిస్తుండగా ఒక్కసారిగా గోడ సుదర్శన్‌పై పడడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. చికిత్స కోసం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు.

రంగనాథస్వామిని దర్శించుకున్న జడ్జిలు



రంగనాథస్వామి సన్నిధిలో జడ్జిలు కవిత, భార్గవి

పులివెందుల టౌన్, మార్చి 2: పులివెందులలోని మధ్య రంగ దేవస్థానంలో వెలసిన రంగనాథస్వామిని కడప సీనియర్ సివిల్ జడ్జి కవిత, జమ్మలమడుగు, పులివెందుల జూనియర్ సివిల్ జడ్జి భార్గవి దర్శించుకున్నారు. వీరికి ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, ఆలయ ఈవో రమణ స్వాగతం పలికారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జడ్జిలను సంప్రదాయంగా సత్కరించారు.

పతనమైన తమలపాకు ధరలు

● బుట్ట కోత కూలి రూ.100

● మార్కెట్ రేటు రూ.60

● పెట్టుబడి కూడా రాక లబోదిబోమంటున్న రైతులు



సాగులో ఉన్న తమలపాకు తోటలు

ఓబులవారిపల్లె, మార్చి 2: ప్రతి శుభకార్యానికి ఎంతో ముఖ్యమైనది తాంబూలం. విందు భోజనం అనంతరం నోరు పండాలంటే ఆకు, వక్క, నమలాల్సిందే. ఇంతటి ఘన కీర్తి కలిగిన తమలపాకు పంట బహువార్షిక పంట. ప్రస్తుత పరిస్థితుల్లో ఒక ఎకరం తమలపాకు పంట సాగు చేయాలంటే రూ.లక్షకు పైబడి ఖర్చు వస్తుంది. ఇది సున్నితమైన పంట. ఎక్కువ నీటి ఎద్దడికి తట్టుకోలేదు, అలాగే పంటకు రోగాలు వచ్చి పూర్తి స్థాయి నష్టం జరిగే అవకాశం కూడా ఉంటుంది. తద్వారా రైతుకు పెట్టిన పెట్టుబడి ఖర్చులు తడిసి మోపడవుతాయి. సాధారణంగా జనవరి నుంచి తమలపాకు సాగు రైతులకు రేట్లు ఆశాజనకంగా ఉండి రైతులకు ఆదాయం సమకూరే సమయం. కానీ సంక్రాంతి నుంచి రేట్లు లేక పూర్తి స్థాయి నష్టాల పాలవుతున్నారు. ఒక బుట్టకు కోత కోస్తే కూలి రూ.100 ఇవ్వాల్సి వస్తోంది. మార్కెట్‌లో బుట్ట మాత్రం రూ.60కే విక్రయించాల్సి వస్తోందని రైతులు లబోదిబోమంటున్నారు.

ఈ తమలపాకు పంట సాగును ఓబులవారిపల్లె, పుల్లంపేట, రైల్వేకోడూరు, రాజంపేట మండల పరిసర ప్రాంతాల్లో ఎక్కువగా సాగు చేస్తారు. వీటిని ప్రధానంగా హైదరాబాదు నగరానికి, తమిళనాడు, బెంగుళూరు, హుబ్లీ, విజయవాడ వంటి ప్రాంతాలకు రైతులే తీసుకెళ్లి అక్కడే ఉన్న వ్యాపారులకు అమ్మకాలు చేపడుతుంటారు. ఎక్కువ భాగం రైతులు హైదరాబాదు మార్కెట్‌పైనే ఆధారపడి సాగు చేస్తుంటారు. రైతులకు హైదరాబాదు వ్యాపారులతో ఐదు దశాబ్దాలకు పైగా లావాదేవీలు జరుగుతున్నాయి. ఈ తమలపాకుల వ్యాపారానికి స్థిరమైన రేటు అంటూ ఉండదు. తమలపాకు సాగును ఏప్రిల్ నుంచి సిద్ధం చేసి అవిశ విత్తనాలను సాగు చేస్తారు. జూన్ నెలలో తమలపాకు విత్తనపు తీగ మొక్కలను నాటి పెంపకం చేస్తారు. అనంతరం రెండు నెలల నుంచి తమలపాకు దిగుబడికి సిద్ధమవుతాయి. సరైన సస్యరక్షణ చర్యలు చేపడుతూ అధిక దిగుబడిని పొందేందుకు రకరకాల పద్ధతులు పాటిస్తారు. సాగుకు ముందు పొలం దుక్కులు, పశువుల ఎరువులు, అవిసె విత్తనాలు, మునగ విత్తనాలు ఏర్పాటు చేసుకోవాలి. అలాగే ప్రస్తుత కాలంలో డ్రిప్ టెక్నాలజీ రావడంతో కాలువల ద్వారా నీటిని పారించే పద్ధతికి స్వస్తి చెప్పారు.

పెట్టుబడి ఖర్చులూ ఎక్కువే..

సాధారణంగా ట్రాక్టర్ దున్నకపు ఖర్చు గంటకు రూ.600- రూ.800 వరకు ఉంటుంది. అవిసె విత్తనాల రేటు సాధారణంగా సేరు రూ.500- రూ.2000 అమ్మిన రోజులు ఉన్నాయి. అలాగే విత్తనపు తీగ రేటు కూడా ఒక్కో సందర్భంలో ఆకాశాన్నంటుతాయి. 6 నుంచి 8 కనుపులు ఉన్న ముదురు తోట తీగలు విత్తనానికి వాడుతారు. 220 తీగలు ఉన్న దాన్ని ఒక కట్ట అంటారు. ఆ కట్ట రేటు రూ.200-1000 వరకు ఉంటుంది. వీటన్నింటినీ అటుంచితే బుట్ట ఆకులు కోయడానికి కోతకూలి రూ.100, అలాగే అదనపు ఖర్చులైన టిఫెన్, భోజనం ఇతరత్రా ఖర్చులు తమలపాకు సాగు రైతు వెచ్చించాల్సి వస్తుంది. అలాగే భూమి ఏర్పాటు చేసిన రైతుకు కౌలుగా సంవత్సరానికి ఒక సెంటుకు రూ.500 చొప్పున సాగును బట్టి చెల్లించాలి. స్తోమతను బట్టి తమలపాకు సాగు రైతు కనీసం 10 సెంట్ల నుంచి రెండు మూడు ఎకరాల వరకు సాగుబడి చేస్తారు. ఇన్ని ఖర్చులు వెచ్చించి లారీల ద్వారా హైదరాబాదు మార్కెట్‌కు తరలిస్తే అక్కడ ఆశాజనకంగా ఉండకపోవడంతో రైతులు నిరుత్సాహం చెందుతున్నారు. ప్రస్తుతం ఉన్న మార్కెట్‌లో రూ.60 కూడా రాకపోవడంతో రూ.వంద కూలీ పెట్టి బుట్టలు కోయించలేక దిగాలు చెందుతున్నారు.

అధిక ఖర్చులతో వేగలేకున్నాం..



నేను కౌలుకు తమలపాకు సాగు చేస్తున్నాను. పిల్లల చదువులు, ఇంటి నిర్మాణం కోసం కొద్దిపాటి ఆదాయం వస్తే సహాయంగా ఉంటుందని 70సెంట్లు సాగు చేస్తున్నాను. బుట్ట రూ.60కు విక్రయిస్తుండడంతో లాభాలు రావడం లేదు. కాబట్టి నేనే సొంతంగా తక్కువ బుట్టలు తెంపుతున్నాను. కనీసం బుట్ట రూ.500 అమ్మితే రైతుకు నష్టం ఉండదు. కోత కూలీనే కాకుండా ఇతరత్రా రేట్లు పెరగడంతో రైతుకు ఇబ్బందులు ఎక్కువవుతున్నాయి. దర్జాగా ఖర్చు పెట్టాల్సిన వాళ్లం. చూసి చూసి ఖర్చులు పెట్టుకోవాల్సి వస్తుంది.

- పాండు రంగనాథ్, ఓబులవారిపల్లె

వ్యాపారులు కట్టడి చేస్తున్నారు..



గతంలో వారానికి మూడు రోజులే హైదరాబాదు మార్కెట్‌కు తమలపాకులు చేరేవి. ప్రస్తుతం ట్రాన్స్‌పోర్ట్ ఈజీ కావడంతో ప్రైవేటు బస్సుల ద్వారా ప్రతిరోజూ హైదరాబాదు మార్కెట్‌కు ఆకులు చేరుతున్నాయి. దీంతో అక్కడ ఉన్న వ్యాపారులు మార్కెట్‌ను కట్టడి చేస్తున్నారు. ఎటు వచ్చి రైతుకు ఇబ్బందులు తప్పడం లేదు.

- కొప్పల నరసింహులు, రైతు, ఓబులవారిపల్లె

ఎన్నికల నిర్వహణకు ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు

స్వేచ్ఛాయుత ఎన్నికల కోసం అన్ని విధాలా సహకరించాలి : కలెక్టర్ అభిషిక్త్ కిశోర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 2: జిల్లాలో స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణకు ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని, స్వేచ్ఛాయుత ఎన్నికల కోసం అన్ని విధాలా సహకరించాలని కలెక్టర్ అభిషిక్త్‌కిశోర్ రాజకీయ పార్టీల నాయకులను కోరారు. శనివారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల నిర్వహణ అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల కోసం అన్ని విధాలా సన్నద్ధంగా ఉన్నామని తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అన్ని కార్యక్రమాలు ప్రణాళికాబద్ధంగా పూర్తి చేస్తున్నామన్నారు. జిల్లాలో ఓటరు చేర్పులు, మార్పులకు, తొలగింపులకు సంబంధించి వచ్చిన దరఖాస్తులన్నింటినీ దాదాపు పరిష్కరించామన్నారు. పెండింగ్ ఉన్న వాటిని వేగంగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఎపిక్ కార్డుల జనరేషన్‌కు సంబంధించి జిల్లాకు వచ్చిన కార్డులను ఎలాంటి పెండింగ్ లేకుండా పంపిణీ చేస్తామన్నారు. జిల్లాలో అన్ని పోలింగ్‌స్టేషన్‌లలో మౌలిక సదుపాయాలను పూర్తి చేశామన్నారు. పత్రికల్లో వచ్చే ప్రతికూల వార్తలకు సంబంధించి డెత్ ఓటర్లు, డబుల్ ఎంట్రీలు తదితర వాటిని అన్ని పరిష్కరిస్తున్నామని, ఈ మేరకు అందరూ ఆర్‌వోలకు తగిన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలు అందించిన ఫిర్యాదులకు సంబంధించి ఎలాంటి పెండింగ్ లేకుండా ఫిర్యాదులను పరిష్కరించడం జరుగుతోందని, ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ మీడియాల్లో వచ్చిన వార్తలపై తీసుకు న్న చర్యల గురించి ఈఆర్‌వోలను అడిగి తెలుసుకున్నారు. వచ్చేవారంలోగా రాజకీయ పార్టీలతో ఎన్నికల అంశంపై వర్క్‌షాప్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ వర్క్‌షాపులో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఆర్డీవోలు రంగస్వామి, మోహన్‌రావు, హరిప్రసాద్, కోడూరు, పీలేరు, తంబళ్లపల్లె ఈఆర్‌వోలు లీలారాణి, రమా, రాఘవేంద్ర, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కోదండరామున్ని దర్శించుకున్న కంచి పీఠాధిపతి



కోదండరామాలయంలో కంచి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి

ఒంటిమిట్ట, మార్చి 2 : ఏకశిలా నగిరి కోదండరాముడిని కంచి కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి స్వామి శనివారం సాయంత్రం దర్శించుకున్నారు. ముందుగా వీరికి టీటీడీ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కడప నుంచి తిరుపతికి వెళుతూ మార్గమధ్యంలో స్వామి వారిని దర్శించుకోవాలనే ఉద్దేశ్యంతో కోదండరామాలయానికి వచ్చామన్నారు. సమస్తలోకంలో రాముడు లేని రాజ్యం, రాముడు లేని గ్రామం ఉండదని ప్రతి గ్రామంలో శ్రీరామచంద్రుని ఆదర్శవంతంగా తీసుకుని సమాజంలోని ప్రజలు జీవించాలన్నారు. జీవితంలో కష్టసుఖాలు సహజమని కష్టసుఖాలను రెండింటిని సమానంగా తీసుకుని ముందుకుపోవడమే మానవ జీవితామన్నారు. టీటీడీ అధికారులు, అర్చకులు వీణా రాఘవాచార్యులు, పవన్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

కిడ్నాప్ కేసులో నిందితుల అరెస్టు

పులివెందుల టౌన్, మార్చి 2: కిడ్నాప్ కేసుకు సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు పులివెందుల అర్బన్ సీఐ శంకర్‌రెడ్డి తెలిపారు. సీఐ తెలిపిన మేరకు కేసు వివరాలు ఇలా ఉన్నాయి. గోకనపల్లె హరివర్ధన్‌రెడ్డి అనే యువకుడు ఉద్యోగం కావాలని లంకపల్లె సాంబయ్య అనే వ్యక్తిని కలువగా అతను హైదరాబాద్‌కు చెందిన కొల్లూరు రాజా, అన్నపూర్ణ రాజాస్వప్నను కలిశారు. హరివర్ధన్‌రెడ్డికి రైల్వేలో టీటీఈ ఉద్యోగం ఇప్పిస్తామని, రూ.14 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ డబ్బును ఫిర్యాది అకౌంట్ నుంచి కొల్లూరు రాజాఅన్నపూర్ణ, రాజాస్వప్నకు చెల్లించినట్లు గత ఏడాది జూలైలో ఒక నకిలీ ఉత్తర్వు ఇచ్చి గుంతకల్లుకు వెళ్లమని తెలిపారు. సాంబయ్య, హరివర్ధన్‌రెడ్డిలు గుంతకల్‌కు వెళ్లి విచారించుకోగా అది నకిలీ ఉత్తర్వు అని మోసపోయినట్లు తెలుసుకుని ఆ డబ్బును తిరిగి కట్టమని డబ్బులు తీసుకున్న వారిపై ఒత్తిడి చేశారు. దీంతో ఈ ఏడాది జనవరి 21న సాంబయ్యను అక్కులుగారి విజయకుమార్‌రెడ్డి, హరివర్ధన్‌రెడ్డిలు ఫోన్ చేసి హైదరాబాద్‌కు రమ్మని తెలుపగా 22వ తేదీ ఆయన హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్‌లోని మాల్ వద్దకు వెళ్లాడు. అక్కడ పులివెందులకు చెందిన విజయకుమార్‌రెడ్డి, నల్లబొమ్మల వెంకటరమణారెడ్డి అలియాస్ వెంకటరెడ్డి సాంబయ్యను బెదిరించి 14 లక్షల రూపాయలు డబ్బు కట్టాలని బలవంతం చేశారు. తర్వాత రాజా స్వప్న అక్కడకు రాగా సాంబయ్య ఆమె ముందు డబ్బుతో నాకు ఎటువంటి సంబంధం అని వాదించగా వెంటనే విజయ్‌కుమార్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి సాంబయ్యను అక్కడి నుంచి తెచ్చి పులివెందులలోని విజయకుమార్‌రెడ్డి ఇంట్లో నిర్బంధించారు. అతడి వద్ద నుంచి బలవంతంగా వంద రూపాయల స్టాంప్ పేపర్‌లపై సంతకాలు చేయించుకుని వదిలిపెట్టారు. సాంబయ్యకు ఆరోగ్యం సరిగా లేక తన గ్రామానికి వెళ్లినా విజయకుమార్‌రెడ్డి బెదిరిస్తున్నట్లు తెలిపారు. దీంతో మానసిక క్షోభకు గురై మార్చి 1వ తేదీ పులివెందుల అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో విజయ్‌కుమార్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, అన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డిలను అరెస్టు చేసి కిడ్నాప్‌కు ఉపయోగించిన స్కార్పియో, మూడు ప్రామిసరీ నోట్లు, వంద రూపాయల స్టాంప్ పేపర్‌లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు. వీరిని కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు.

ఎన్నికల విధుల నుంచి వలంటీర్లను నిలువరించాలి

● హైకోర్టులో పిల్ వేసిన రాజంపేట వాసి

రాజంపేట, మార్చి 2 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సచివాలయం వలంటీర్లను విధుల్లో పాల్గొనకుండా నిలువరించాలని కోరుతూ షేక్ అబుబకర్ సిద్దిక్ అనే యువకుడు హైకోర్టులో పిల్ దాఖలు చేశాడు. రాజంపేట పట్టణం బీయస్ హాల్ సమీపంలో నివాసం ఉంటున్న అబుకర్ సిద్ధిక్ హైదరాబాదులో ఐఏఎస్ కోచింగ్ తీసుకుంటున్నాడు. రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికల విధానాలపై హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఆయన హైకోర్టులో దాఖలు చేసిన పిల్‌లో వచ్చే ఎన్నికల్లో వలంటీర్లను పోలింగ్ బూత్ ఏజెంట్లుగా వ్యవహరించకుండా అడ్డుకోవాలని ఆయన కోరారు. కేంద్ర ఎన్నికల సంఘం చీఫ్ ఎలక్షన్ అధికారి ఈ ఏడాది ఫిబ్రవరిలో జారీ చేసిన ఉత్తర్వులకు అనుగుణంగా వ్యవహరించేలా ఆదేశించాలని కోరారు. దీనికి సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సాధారణ పరిపాలనా శాఖ ముఖ్య కార్యదర్శి, పంచాయతీరాజ్, పురపాలక, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శులు, వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, గ్రామ వార్డు సచివాలయ వలంటీర్ల శాఖ ముఖ్య కార్యదర్శి, కేంద్ర ఎన్నికల సంఘం చీఫ్ ఎలక్ట్రోల్ ఆఫీసర్, వైసీపీ అధ్యక్షుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, వ్యక్తిగత హోదాలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాద్‌రావులను ప్రతివాదులుగా పేర్కొంటూ పిల్ దాఖలు చేశారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయండి


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

రాయచోటి టౌన్, మార్చి 2: పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఉషశ్రీ పిలుపునిచ్చారు. పల్స్ పోలియో కార్యక్రమంపై రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నుంచి శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఈనెల 3వ తేదీ ఆదివారం అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 5 సంవత్సరాలలోపు పిల్లలందరికీ నిర్దేశించిన బూత్‌లలో పోలియో చుక్కలు వేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా 1602 పోలియో చుక్కల బూత్‌లు ఏర్పాటు చేశామని, 5 సంవత్సరాలలోపు పిల్లలు లక్షా 93 వేల 946 మందికి పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటికే ఈ కార్యక్రమంలో పాల్గొనే వైద్య ఆరోగ్య, విద్యాశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖల సిబ్బందికి, వలంటీర్లకు శిక్షణ ఇచ్చామన్నారు. ఒకవేళ 3వ తేదీ ఆదివారం పోలియో చుక్కలు వేయించుకోకపోతే 4, 5వ తేదీలు అనగా సోమ, మంగళ వారాలలో సంబంధించిన బూత్ సిబ్బంది ఇంటికి వచ్చి పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. అనంతరం రాయచోటి పట్టణ కేంద్రంలోని ఏరియా ఆసుపత్రి నుంచి నేతాజీ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ డేవిడ్ సుకుమార్, డిప్యూటీ డెమో దేవశిరోమణి, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశావర్కర్లు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

● ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యం : తహసీల్దార్

సుండుపల్లె, మార్చి 2: ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ జరీనా తెలిపారు. శనివారం మడితాడు, పెద్దినేనికాలువ, ముడుంపాడు గ్రామ పంచాయతీల్లో 14 పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. నిర్మాణంలో ఉన్న టాయిలెట్లు త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రజలకు వీలుగా ఉండేలా, వికలాంగులకు ఇబ్బంది లేకుండా పరీక్షా కేంద్రానికి వచ్చేలా ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీరు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్, రెడ్డి, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాత్రపై విచారించాలి

● రాయచోటి టీడీపీ నాయకుడు లక్ష్మిప్రసాద్‌రెడ్డి


మీడియాతో మాట్లాడుతున్న లక్ష్మిప్రసాద్‌రెడ్డి

రాయచోటి టౌన్, మార్చి 2: వైఎస్ వివేకానందరెడ్డిని హత్య కేసులో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాత్రపై విచారణ జరిపించాలని రాయచోటి టీడీపీ నాయకుడు మండిపల్లి లక్ష్మిప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్‌కాలనీలో గల మండిపల్లి భవన్‌లో టీడీపీ కార్యకర్తలతో కలిసి మీడియాతో మాట్లాడారు. మొదట సీబీఐ విచారణ కోరిన జగన్‌రెడ్డి తరువాత వద్దు అనడం వెనుక కారణాన్ని రాష్ట్ర ప్రజలకు చెప్పాలన్నారు. జగన్ సీఎం కాగానే కేసు విచారణలో పురోగతి ఎందుకు ఆగిపోయిందని ప్రశ్నించారు. తన తండ్రికి న్యాయం చేయాలని కూతురు పోరాడుతుంటే తమ్ముడిని సీబీఐ అరెస్టు చేయకుండా జగన్ అడ్డుపడ్డారని ఆరోపించారు. వైసీపీ శవ రాజకీయాలు చేయడం మానుకోవాలని కోరారు. ఆడబిడ్డకు న్యాయం చేయలేని సీఎం రాష్ట్రంలో ఉన్న అక్కచెల్లెమ్మలకు ఏం న్యాయం చేస్తారని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రవీంద్రారెడ్డి, రమణారెడ్డి, మురళి, కృష్ణ, సూర్యనారాయణరెడ్డి, నాగార్జున చౌదరి, బాలకొండ, వీరారెడ్డి, ఓబుల్‌రెడ్డి, నాగేశ్వారెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

అదనపు తరగతి గదులు ప్రారంభం

రామాపురం, మార్చి 2: మండలంలోని నీలకంఠ్రావుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.1.60 కోట్ల నిధులతో నిర్మించిన అదనపు తరగతి గదులు, రూ.22.70 లక్షలతో వైఎస్ఆర్ హెల్త్ క్లీనిక్ సెంటర్‌ను శనివారం ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, ఆర్జేడీ రాఘవరెడ్డి, డీఈవో శివప్రకాశ్‌రెడ్డిలు ప్రారంభించారు. తరగతి గదుల్లో డిజిటల్ విద్యను బోధించారు. డిజిటల్ తరగతుల వల్ల కలిగే మేలును వివరించారు. స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీల ద్వారా పాఠ్యాంశాల బోధన విజయవంతంగా సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్జేడీ రాఘవరెడ్డి, డీఈవో శివప్రకాశ్‌రెడ్డి, ఎంఈవోలు రామకృష్ణుడు, జయచంద్ర, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుజాతమ్మ, జడ్పీటీసీ మానస వెంకట్రమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాలసుబ్రమణ్యంను కలిసిన శ్రీరాందాస్‌చౌదరి

రాయచోటిటౌన్, మార్చి 2: జిల్లా పరిధిలో మదనపల్లె నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి శ్రీరాందాస్‌చౌదరి శనివారం రాయచోటి పట్టణంలోని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంను ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు టీడీపీ, జనసేన పార్టీల కలయిక ఒక చారిత్రక అవసరం అని ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించుకున్నారు. అలాగే రాబోయే ఎన్నికల్లో రాజంపేట పార్లమెంట్ పరిధిలో టీడీపీ జెండా రెపరెపలాడాలని, ఆ దిశగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మదనపల్లె నేతలు సీడ్స్ మల్లికార్జుననాయుడు, జంగాల శివరాం, యుగంధర్, సురేంద్ర, గౌతమ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్లు

● వారం రోజుల్లో గంగమ్మజాతర
● ఆగ్రహం వ్యక్తం చేస్తున్న భక్తులు


గుంతలమయంగా ఉన్న మర్రిచెట్టు నుంచి గంగమ్మజాతరలోకి వెళ్లే రోడ్డు

లక్కిరెడ్డిపల్లె, మార్చి 2: మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మ తల్లి జాతర ఈ నెల 11, 12 తేదీల్లో జరగనున్నది. ఈ జాతరకు రాయలసీమ జిల్లాలోనే ప్రత్యేకత ఉన్నది. కానీ ఈ ఆలయానికి వచ్చే రోడ్లు మాత్రం అధ్వానంగా ఉన్నాయి. ఎటుచూసినా గుంతలు ఏర్పడి దారుణంగా ఉన్నాయి. అప్రమత్తంగా లేకపోతే కిందపడి గాయాలపాలు కావాల్సిందే. జాతర జరిగే నాలుగు వారాల్లో వందల సంఖ్యలో ఆర్టీసీ బస్సులు, వేల సంఖ్యలో ప్రైవేటు వాహనాలు ఈ రోడ్డు గుండానే వెళ్లాల్సి ఉంటుంది. వారం రోజుల్లో జాతర ఉన్నా.. రోడ్లపై దృష్టి పెట్టేవారే లేరని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రాయచోటి నుంచి కుర్రాతల మర్రిమాను నుంచి జాతరకు 3 కి.మీ. కాగా, లక్కిరెడ్డిపల్లె తహసీల్దారు కార్యాలయం నుంచి 3 కి.మీ. ఉంటుంది. అలాగే కడప నుంచి వచ్చే వాహనాలు చిట్లూరి నుంచి జాతర లోపలికి వస్తాయి. ఈ రోడ్లలో ఒక్క లక్కిరెడ్డిపల్లె నుంచి ఆలయానికి వచ్చే రోడ్డు మాత్రం ఒక వారం కిందట వేశారు. మిగతా రోడ్లు గుంతలమయంగానే ఉన్నాయి. ఇప్పటికే ప్రతి ఆదివారం వందల వాహనాల్లో భక్తులు ఆలయానికి వస్తుంటారు. ఇంత ప్రత్యేకత ఉన్న జాతరకు లక్షల సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుంటారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గంగమ్మజాతరకు రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రజలు, భక్తులు కోరుతున్నారు.

టీడీపీ కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం


కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న పరిశీలకుడు హేమాంబధరరావు

రైల్వేకోడూరు, మార్చి 2: రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ మార్పుపై వస్తున్న వదంతులపై శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఐదు మండలాలకు చెందిన కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నియోజకవర్గ పరిశీలకుడు హేమాంబధరావు హాజరై మాట్లాడారు. టీడీపీలోకి ఎవరు వచ్చినా ఆహ్వానిస్తున్నామని, ఈ కోవలోనే ముక్కా రూపానందరెడ్డిని పార్టీలో చేర్చుకున్నామ న్నారు. రైల్వేకోడూరులో టీడీపీకి బలం చేకూరిందని, చంద్రబాబును సీఎం చేయడమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. రైల్వేకోడూరులో అభ్యర్థిని గెలిపించి చంద్రబాబు ముందు నిలబెట్టాలని కార్యకర్తలను కోరారు. అధిష్ఠానం ఆదేశాల మేరకు తాను రైల్వేకోడూరుకు వచ్చామని, కార్యకర్తలు ఆగ్రహానికి గురికావద్దని కోరారు. అధిష్ఠానం ఆదేశాలను పాటించాలన్నారు. కస్తూరి విశ్వనాథనాయుడు మాట్లాడుతూ 2019లో 36 వేల ఓట్ల తేడాతో రైల్వేకోడూరులో టీడీపీ ఓడిపోయిందని, అప్పటి నుంచి ప్రతి రోజు పార్టీ కోసం పనిచేస్తున్నానని, అన్ని సామాజిక వర్గాలను దగ్గరకు తీసుకుని పార్టీని బలోపేతం చేస్తున్నామని తెలిపారు. తాము పార్టీ అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉంటామన్నారు. కార్యకర్తలు, నాయకులు ఎక్కడ కూడా పార్టీకి వ్యతిరేకంగా కార్యక్రమాలను చేయవద్దని తెలిపారు. ఏదేమైనా టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అనంతరం ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వర నాయుడు, రాష్ట్ర బీసీ నాయకుడు కమతం నాగరాజుయాదవ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు కేజేపీ రెడ్డయ్యానాయుడు, నాయుని బాలాజీ, రాష్ట్ర బీసీ నాయకులు నాయుడోరి రమణ, సీనియర్ నాయకుడు కల్లా చలపతి, చంద్రమోహన్, యువ నాయకులు నవీన్, హేమరాజ్, పట్టణ అధ్యక్షుడు మణి, ఐదు మండలాలకు చెందిన కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంతరిక్షానికి దూసుకుపోతున్న మహిళలు

● నందలూరు జూనియర్ సివిల్ జడ్జి లత

నందలూరు, మార్చి 2: మహిళలు వివిధ రంగాల్లో రాణించడంతో పాటు అంతరిక్షానికి కూడా రాకపోకలు సాగిస్తూ విజయపథంలో దూసుకెళ్తున్నారని నందలూరు జూనియర్ సివిల్ జడ్జి లత అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పోష్ యాక్ట్ పై స్థానిక కోర్టులో మహిళలకు అవగాహన కల్పించారు. ముందుగా కోర్టు సిబ్బంది సుమలత ఖాసింబీ, శిరీష, లక్ష్మీదేవిలను జడ్జి శాలువాతో ఘనంగా సత్కరించడంతో పాటు నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ పారిశుధ్య మహిళా కార్మికులు ఆరుగురికి చీరలను అందజేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించడమే ఈ పోష్‌యాక్ట్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వసుంధర, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి నరసింహులు, ఏజీపీ షమీఉల్లా ఖాన్, న్యాయవాదులు ఏ.వి.సుబ్రమణ్యం, షేక్ మహమ్మద్ అలీ, సుబ్బరామయ్య, అంబిక, గౌరీ, సుప్రజ, అనుదీప్, జయసింహ, శోభ, నూరి, నిలీమ, క్లర్క్ పీరా, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మేధావులకు పుట్టినిల్లు.. నందలూరు

నందలూరు, మార్చి 2: ఎంతోమంది మేధావులకు నందలూరు మండలం పుట్టినిల్లు అని రాజంపేట నియోజకవర్గ టీడీపీ నాయకుడు మేడా విజయశేఖర్‌రెడ్డి, బీజేపీ రాజంపేట కో-కన్వీనర్ డాక్టర్ అరిగె రాంప్రసాద్‌లు పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర మదర్ ల్యాండ్ సంస్థ 25వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం రాత్రి ఆ సంస్థ అధ్యక్షుడు శ్యామ్‌రాజ్ ఆధ్వర్యంలో రైల్వే కళాక్షేత్రంలో విద్యార్థులకు పాడుతా తీయగా డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలలో సబ్ జూనియర్స్ పాడుతాతీయగా, సోలో డ్యూయెట్ అండ్ గ్రూప్ డ్యాన్స్ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి యాదవ్, గురు ప్రసాద్, సునీల్‌రెడ్డి, అశోక్‌కుమార్, హెచ్ఎం డి.శ్రీనివాసులు, ప్రభాకర్, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

పోలిగ్రామంలో టీడీపీ శంఖారావం

రాజంపేట, మార్చి 2: రాజంపేట మండలం పోలి పంచాయతీలో శనివారం మండల అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్యనాయుడు ఆధ్వర్యంలో టీడీపీ శంఖారావ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పోలి బూత్‌లో రిజిస్ట్రేషన్, ప్రతి ఇంటికి వెళ్లి టీడీపీ సూపర్ సిక్స్ క్యాలెండరు ఇచ్చి వారికి ప్రభుత్వం వస్తే జరిగే మేలు గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని, దుష్ట వైసీపీ పాలనని ఓడించడం తప్పనిసరి అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు రామచంద్రయ్య, మల్లికార్జునరెడ్డి, పెంచలయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

పోలియో రహిత మండలంగా తీర్చిదిద్దాలి

నందలూరు, మార్చి 2: మండలాన్ని పోలియో రహిత మండలంగా తీర్చిదిద్దాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శరత్‌కమల్ అన్నారు. శనివారం పీహెచ్‌సీలో పల్స్‌పోలియో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు పిల్లలకు వంద శాతం పోలియో చుక్కలను వేయాలన్నారు. మండలంలో 4800 మంది ఐదు సంవత్సరాల్లోపు పిల్లలున్నారని, వీరికి మండలంలో 48 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కార్తీక్ విశ్వనాథ్, సి.హెచ్.వో వెంకటనారాయణ, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

షర్మిలను కలిసిన శ్రీనాథ్


షర్మిలను అభ్యర్థిస్తున్న శ్రీనాథ్

రాజంపేటటౌన్, మార్చి 2: రాజంపేట అసెంబ్లీ కాంగ్రెస్ టికెట్టు తనకు కేటాయిస్తే అత్యధిక మెజారిటీతో విజయం సాధిస్తానని పీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిలకు కాంగ్రెస్ పార్టీ నేత అత్తింజేరి శ్రీనాథ్ వినతిపత్రం అందజేశారు. శనివారం తిరుపతిలోని తాజ్ హోటల్‌లో రాజంపేటకు చెందిన పీసీసీ కమిటీ సభ్యుడు గంగాధర్ తనయుడు శ్రీనాథ్ షర్మిలను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తన తండ్రి కాంగ్రెస్ పార్టీకి మెరుగైన సేవలందించారని గుర్తు చేశారు.

మహిళకు రూ.30 వేల ఆర్థిక సాయం


బాధితురాలి బంధువుకు చెక్కును అందిస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు, మార్చి 2: పట్టణానికి చెందిన ఎన్.సరస్వతి ఊపిరితిత్తుల వ్యాధితో గత కొంతకాలంగా బాధపడుతున్న విషయం తెలుసుకున్న టీడీపీ యువనేత ముక్కా సాయివికాస్‌రెడ్డి శనివారం రూ.30 వేలు ఆర్థికసాయం చేశారు. ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ తరఫున తిరుపతిలో చికిత్స పొందుతున్న సరస్వతికి ఈ సాయం అందించారు. ఈ కార్యక్రమంలో బైసాని సుజాత, కొప్పరపు అరవింద్, నారపరెడ్డి రాజారెడ్డి, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, ముక్కావారిపల్లె సర్పంచ్ అరవ శ్రీధర్, సాలవ రమణరాజు, అడపాల ప్రేమ్‌కుమార్, గౌతంరాజు పాల్గొన్నారు.

తల్లికి వందనం కార్యక్రమం


తల్లులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

రైల్వేకోడూరు, మార్చి 2: పట్టణంలోని విజ్‌డమ్ సెంట్రల్ స్కూలులో శనివారం తల్లికి వందనం కార్యక్రమం కరస్పాండెంట్ ప్రదీప్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్కూలు విద్యార్థిని, విద్యార్థులు తల్లుల పాదాలకు పూలతో పూజించి ఆశీస్సులు పొందారు. పిల్లలను తల్లులు అక్షింతలతో ఆశీర్వదించారు. తల్లిదండ్రులను ఎలా గౌరవించాలి, ఉపాధ్యాయులతో ఎలా ప్రవర్తించాలి, సమాజంలో ఎలా నడుచుకోవాలి అన్న విషయాలను ప్రదీప్ వివరించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డైరెక్టర్ టి.మదన్‌మోహన్, ప్రిన్సిపాల్ టి.ప్రియాంకా తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక లేక ప్రజల అవస్థలు


శ్మశానానికి వెళ్లేందుకు అవస్థలు పడుతున్న ప్రజలు

సిద్దవటం, మార్చి 2: మండల పరిధిలోని కడపాయపల్లె హరిజనవాడలో గత కొన్నేళ్లుగా శ్మశానవాటిక లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఎవరైనా మృతి చెందితే పొలాలు గట్ల మీదుగా తీసుకెళ్లి పెన్నానదిలో దహనం చేస్తున్నట్లు వాపోయారు. శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఏ మాత్రం పట్టించుకోవడం లేదని వాపోయారు. గ్రామంలో వ్యక్తి చనిపోతే దహనం చేసేందుకు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి ఫలితం లేదని ఆరోపించారు. ఇప్పుడైనా అధికారులు స్పందించి శ్మశానవాటికను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. కాగా శనివారం సదరు గ్రామంలో ఓ వ్యక్తి చనిపోతే శ్మశానానికి తీసుకెళ్లేందుకు అవస్థలు పడ్డారు.

రూ.7.85 కోట్లతో వంతెన నిర్మాణ పనులు


భూమిపూజ చేస్తున్న అధికారులు

వీరబల్లి, మార్చి 2: మండలంలోని పుల్లగూర గండి వద్ద మాండవ్యనదిపై వంతెన నిర్మాణానికి రూ.7.85 కోట్లతో ఆర్అండ్‌బీ ఎస్ఈ మహేశ్వర్‌రెడ్డి, విశ్రాంత ఎస్ఈ జయరామిరెడ్డిలు శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలు వచ్చిన సమయంలో వేసిన కల్వర్టు కొట్టుకుపోవడంతో వంగిమళ్ల వాసులకు అటువైపు పోలేకున్నారని, ఈ వంతెన నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో కుమార్ బాబు, వైసీపీ నాయకులు తారకేశ్వర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

రాజంపేటటౌన్, మార్చి 2: రాజంపేట పట్టణంలో జరుగుతున్న ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని డీఈసీ ప్రకాశ్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని రీజెన్సీ గవర్నమెంటు జూనియర్ కాలేజీ, షిరిడీసాయి జూనియర్ కాలేజీలలోని పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నలంద జూనియర్ కాలేజీ పరీక్షా కేంద్రంలో 16 మంది, గవర్నమెంటు జూనియర్ కాలేజీ కేంద్రంలో ఆరుగురు, షిరిడీ జూనియర్ కాలేజీలో 16 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారన్నారు. పరీక్షా సమయానికి 15 నిమిషాలు ముందుగా విద్యార్థులు తమ హాల్ టికెట్లను తీసుకొచ్చి కేటాయించిన గదులలో ఆశీనులు కావాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్లయింగ్ స్క్వాడ్ వై.నరసింహ, డీటీ రమణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారికి రూ.27,500 చేయూత


నగదు అందజేస్తున్న ఎస్ఐ, ట్రస్ట్ నిర్వాహకులు

పుల్లంపేట, మార్చి 2: నిరుపేద కుటుంబంలోని చిన్నారి చికిత్స కోసం స్పందన చారిటబుల్ ట్రస్ట్ శనివారం చేయూతనిచ్చి ఆర్థిక సాయం అందించారు. మండల పరిధిలోని శ్రీరాములపేటలో నివాసముంటున్న కత్తి సుబ్బరాయుడు, లలిత దంపతుల కుమార్తె తేజశ్రీ స్కిన్ వ్యాధితో బాధపడుతుండటంతో విషయం తెలుసుకున్న స్పందన ట్రస్ట్ నిర్వాహకులు రూ.27,500 ఆర్థిక సహాయాన్ని పుల్లంపేట ఎస్ఐ రఘురాం చేతుల మీదుగా అందజేశారు. అలాగే ఎస్ఐ రఘురాం, కానిస్టేబుళ్లు కొంత మేర చిన్నారి తల్లిదండ్రులకు అందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

సంబేపల్లె, మార్చి 2: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ దిలీప్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓసీ, బీసీ విద్యార్థులు దరఖాస్తు రుసుం రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు దరఖాస్తుల రుసుం రూ.75 చెల్లించి మార్చి 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రిజర్వేషన్ల ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తామని తెలిపారు. సమాచారం కొరకు 98493 18618 నెంబర్‌కు సంప్రదించగలరని తెలిపారు.

రామాపురం: ఏపీ ఆదర్శ (మోడల్) పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గానూ 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ఎండీ అప్రోజ్‌బేగం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 3వ తేది నుంచి ఈ నెల 31 వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 21న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు స్థానిక ఆదర్శ పాఠశాలల్లోనే ఉంటుందన్నారు.

పెనగలూరు: మండల కేంద్రంలోని పెనగలూరు ఆదర్శ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో చేరాలనుకున్న విద్యార్థులు ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపల్ ఎస్.సహజ బ్లెస్సీ తెలిపారు. పూర్తి వివరాలకు ఇంటర్‌నెట్ సెంటర్లలో ఆదర్శ పాఠశాల వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

లక్కిరెడ్డిపల్లె: లక్కిరెడ్డిపల్లె ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంగ్లీష్ మీడియం 2024-25 విద్యా సంవత్సరానికి 6వ తరగతి ప్రవేశం కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాన్నారు.

'కార్పొరేట్ శక్తుల ఊబిలో ఏపీ'

రాయచోటిటౌన్, మార్చి 2: కార్పొరేట్ శక్తుల ఊబిలో రాష్ట్ర ప్రభుత్వం కూరుకుపోయిందని అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) జిల్లా కన్వీనర్ జేపీ నాగిరెడ్డి అన్నారు. శనివారం రాయచోటి పట్టణ పరిధిలోని చిత్తూరు రోడ్డులో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట ఏబీవీపీ ఆధ్వర్యంలో స్టూడెంట్స్ మేనిఫెస్టో గోడపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ విద్యారంగ పునర్జీవం కోసం ఏబీవీపీ ఆధ్వర్యంలో మార్చి 5న తిరుపతిలో స్టూడెంట్ మేనిఫెస్టోను విడుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి ప్రశాంత్, దేవా, త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు పల్స్‌పోలియో

రామాపురం, మార్చి 2: ఆదివారం జరగనున్న 0-5 సంవత్సరాలలోపు 4072 మంది చిన్నారులకు వందశాతం పల్స్ పోలియో చుక్కలు వేయనున్నామని మండల ప్రాథమిక వైద్యాధికారి వినోద్‌కుమార్, డాక్టర్ దివ్యశ్రీలు తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో మొత్తం 47 కేంద్రాలు, 5 రూట్లు మండల పరిధిలోని ప్రాథమిక, ఉన్నత, అంగన్వాడీ, జడ్పీ పాఠశాలలలోనూ, రామాపురం బస్టాండులో ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రాల వద్దకు వెళ్లి తల్లిదండ్రులు తమ చిన్న పిల్లలకు పల్స్‌పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, అంగన్వాడీ వర్కర్లు పాల్గొంటారని తెలిపారు.


గుర్తు తెలియని మహిళ మృతి

రాజంపేటటౌన్, మార్చి 2: రాజంపేట పట్టణ శివారులోని సున్నపురాళ్లపల్లె సమీపంలో రైలు ప్రమాదంలో మహిళ మృతి చెందినట్లు స్థానికులు గుర్తించారు. శనివారం ఉదయం గుర్తు తెలియని రైలు మహిళను ఢీకొనడంతో మృతి చెందినట్లు స్థానికులు గుర్తించి రైల్వేశాఖాధికారులకు సమాచారం అందించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని వారు తెలిపారు.

సచివాలయ తరలింపు నిరసిస్తూ వైసీపీకి రాజీనామా

చిన్నమండెం, మార్చి 2: వండాడి గ్రామ పంచాయతీకి చెందిన మాజీ రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ మల్లూరు రెడ్డి వరప్రసాద్ వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వండాడి గ్రామ సచివాలయాన్ని మెజార్టీ ప్రజల అభిమతానికి వ్యతిరేకంగా కొందరు స్వార్థపరుల మాటలు విని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తరలించడం సరైనది కాదని విమర్శించారు. 70 శాతం ప్రజలకు సౌకర్యంగా ఉన్న సచివాలయాన్ని తరలించడం ప్రజలను ఇబ్బంది పెట్టడానికే అన్నారు. సచివాలయం తరలించవద్దని కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ ముందుకెళ్లడం విచారకరమన్నారు. ఎవరికి వారు సచివాలయం తరలించుకుంటూ పోతే రేపటి రోజున శాశ్వత భవనాలు కట్టడం వ్యర్థమన్నారు. సచివాలయం తరలించడం లేదంటేనే తమకు ప్రజలు ఓట్లు వేసి గెలిపించారని, అలాంటిది ఇప్పుడు సచివాలయం తరలిస్తుంటే మమ్మల్ని నమ్మి ఓట్లు వేసిన ప్రజలను మోసగించడం అవుతుందన్నారు. వైసీపీ మండల ప్రధాన కార్యదర్శిగా తాను, వార్డు సభ్యురాలిగా తన తల్లి మల్లూరు పాపలమ్మ రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. గాండ్లపల్లె రహదారి సమస్య, 20 ఏళ్ల క్రితం కట్టుకున్న హరిజనవాడ ప్రజల గృహాలకు పొజిషన్ సర్టిఫికెట్, తూర్పుపల్లె ముస్లిం కుటుంబాలకు ఇంటి పట్టాలు ఇప్పించలేని పదవులు ఉన్నా, లేకున్నా ఒకటేనని ఆవేదన వ్యక్తం చేశారు.

స్నేహం అంటే ఇదేరా


అన్నదానం చేస్తున్న షంషీర్

రైల్వేకోడూరు(రూరల్), మార్చి 2: పట్టణానికి చెందిన షేక్ షంషీర్ అనే వ్యాపారి తన స్నేహితుడు వెంకటరమణ జ్ఞాపకార్థంగా శనివారం రైల్వేకోడూరులో పేదలకు అన్నదానం చేశారు. తన స్నేహితుడు తమ మధ్యలో లేకున్నా ఆయన జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ పేదలకు ప్రతి ఏడాది అన్నదానం చేస్తున్నట్లు షంషీర్ తెలిపారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

లక్కిరెడ్డిపల్లె, మార్చి 2: పేద, ధనిక అనే తేడా లేకుండా విద్యార్థి దశనుంచి కష్టపడి చదివితే మంచి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని లక్కిరెడ్డిపల్లె కోర్టు సివిల్ జడ్జి షేక్ ఫైజున్నిసా పేర్కొన్నారు. శనివారం ఏపీ మోడల్ స్కూల్ బాలికల వసతి గృహాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా వసతులను ఆమె పరిశీలించి మెనూ ప్రకారం అన్నీ అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ క్యార్యక్రమంలో ప్రిన్సిపల్ శివశంకర్‌రెడ్డి, మండల లీగల్ అథారిటీ సిద్దయ్య, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తికి ఉత్సవ కళ



భక్తకన్నప్ప

ఆకట్టుకుంటున్న విద్యుదలంకరణలు

●ముక్కంటి శివరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం



ముక్కంటి ఆభరణాలు


శ్రీకాళహస్తి, మార్చి 2: భవుడి మహా శివరాత్రి ఉత్సవాలకు శ్రీకాళహస్తి సర్వాంగసుందరంగా ముస్తాబైంది. ముక్కంటి ఆలయాన్ని ముచ్చటైన రంగవల్లులతో తీర్చిదిద్దారు. గోపురాలు కొత్త రంగులతో కళకళలాడుతున్నాయి. భక్తకన్నప్ప, రామసేతు వంతెనల పైనా, పట్టణవ్యాప్తంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. అరటిచెట్లు, మామిడాకుల పచ్చతోరణాలు, కాషాయరంగు జెండాలతో వీధులు దర్శనమిస్తున్నాయి.భక్తుల కోసం ఆలయంలో చలువపందిళ్లు ఏర్పాటు చేశారు. చతుర్మాడ వీధులు, సాంస్కృతిక కార్యక్రమాల వేదికైన ధూర్జటి కళాప్రాంగణాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. సన్నిధివీధిలో ఏర్పాటు చేస్తున్న కైలాసం సెట్టింగ్ పనులు జోరందుకున్నాయి. రథాలు, నారద పుష్కరణిలోని తెప్పలను రంగులతో ముస్తాబు చేస్తున్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని బ్యాంకు లాకర్లో ఉన్న జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడి ఆభరణాలను శనివారం ముక్కంటి ఆలయానికి చేర్చారు. ఉత్సవాల్లో స్వామి, అమ్మవార్లు ఈ ఆభరణాలను ధరిస్తారు.



ఆలయంలో పూల అలంకరణలు

కన్నప్ప ధ్వజారోహణంతో నేడు ప్రారంభం

శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాలు ఆదివారం భక్తకన్నప్ప ధ్వజారోహణంతో ప్రారంభం కానున్నాయి. పరమశివుడి వరంతో కన్నప్పగా మారిన తిన్నడికి కొండపై స్థానమిచ్చి, కిందిభాగంలో దేవదేవుడు కొలువైన పుణ్యక్షేత్రమిది. దీంతో భక్తుడు కన్నప్పకు తొలి పూజ చేసి ఉత్సవాలకు అంకురార్పణ చేయడం ఆనవాయితీగా వస్తోంది. 14 రోజులు జరిగే శివరాత్రి ఉత్సవాల్లో ప్రథమంగా కన్నప్ప ధ్వజారోహణం జరగనుంది. ఇందులో భాగంగా ఆదివారం ఆలయ అలంకార మండపం నుంచి భక్త కన్నప్ప ఉత్సవ మూర్తిని కొండపైకి ఊరేగింపుగా తీసుకువెళ్తారు. అక్కడ వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి, శాస్త్రోక్తంగా కన్నప్ప ధ్వజారోహణం మహాక్రతువును నిర్వహించి దేవతలకు ఆహ్వానం పలుకుతారు.



కన్నప్ప ఆలయం

ఎంఎస్ఎంఈ సర్వే పకడ్బందీగా చేయాలి : కలెక్టర్

చిత్తూరు (సెంట్రల్), మార్చి 2: మైక్రో స్మాల్ మీడియం ఎంటర్‌ప్రెన్యూర్ (ఎంఎస్ఎంఈ) సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ షన్మోహన్ ఆదేశించారు. రెవెన్యూ, రీ సర్వే మూడో దశ ఇనామ్, అసైన్డ్ భూములు, ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్, హౌసింగ్, పీఆర్అండ్ డీఆర్, ఎన్ఆర్ఈజీఎస్, కరువు మండలాల్లో వేజ్ జనరేషన్, తాగునీటి ఎద్దడి, పరిశ్రమలు, ఎంఎస్ఎంఈలకు భూ కేటాయింపులు, ఆరోగ్యం, వైద్య, ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీకార్డుల పంపిణీ, పల్స్‌పోలియో తదితర అంశాలపై శనివారం విజయవాడ సీఎస్ కార్యాలయం నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా నుంచి కలెక్టర్‌తోపాటు జేసీ శ్రీనివాసులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ జిల్లాలోని వివిధ శాఖాధికారులతో పైఅంశాలపై సమీక్షించారు. మూడోదశ రీసర్వేకి సంబంధించి 74 గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ పూర్తి చేసినట్లు తెలిపారు. 20213 హౌస్ సైట్స్ రిజిస్ట్రేషన్ పూర్తి చేయగా, 82,483 ఉపాధి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. 315807 ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ పూర్తి చేయగా, ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించాలన్నారు.

సమీక్షలు - సమావేశాలు

అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించొద్దు

చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి

చిత్తూరు, మార్చి 2: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఎలాంటి ముందస్తు అనుమతుల్లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించకూడదని చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు తలెత్తే అవకాశం ఉండటంతో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీసు 30 యాక్టు అమల్లోకి వచ్చిందన్నారు. చిత్తూరు ఒకటి, రెండో పోలీసుస్టేషన్లతో పాటు తాలూకా పోలీసుస్టేషన్, జీడీ నెల్లూరు, ఎస్ఆర్‌పురం, పెనుమూరు, యాదమరి, గుడిపాల, తవణంపల్లె, కాణిపాకం, పూతలపట్టు, ఐరాల, కల్లూరు, రొంపిచెర్ల పోలీసుస్టేషన్ల పరిధిలో ఈ యాక్టు అమలులో ఉంటుందన్నారు. ఈ స్టేషన్ల పరిధిలో సభలు, సమావేశాలు జరపాలనుకుంటే ముందస్తుగా అనుమతి తీసుకోవాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం తీసుకున్న నిర్ణయానికి అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో సీఐ విశ్వనాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య



లక్ష్మి మృతదేహం

గుడుపల్లె,మార్చి2:కులాంతర వివాహం కారణంగా తల్లిదండ్రులు మాట్లాడలేదని మానసిక ఆవేదన చెంది ఓ వివాహిత ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మ హత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... ఒంటిపల్లెకు చెందిన మునిరాజు, నీలమ్మల కుమార్తె లక్ష్మి (18) ఏడాదిక్రితం కోటచెంబగిరి గ్రామానికి చెందిన వెంకటేశు కుమారుడు లోకేష్‌ను కులాంతర వివాహం చేసుకుంది. వివాహం జరిగినప్పటి నుంచి ఈమెతో తల్లిదండ్రులు మాట్లాడడంలేదు. కొన్నిసార్లు పుట్టింటికి వెళ్లినా వారు ఇక్కడకు రాకూడదని లక్ష్మితో పలుమార్లు గొడవపడ్డారు. దీంతో లక్ష్మి భర్త లోకేష్, ఇరుగుపొరుగు వారితో ఈ విషయం చెప్పి బాధపడేది. శుక్రవారం మానసిక ఆవేదన చెందిన లక్ష్మి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడకు చేరుకుని శవాన్ని కుప్పం ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టు నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. లక్ష్మి తల్లి నీలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.86 కోట్లు

తిరుమల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.86 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 59,646 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 21,938 మంది తలనీలాలు సమర్పించారు.

బస్సును ఢీకొన్న లారీ : 35మందికి గాయాలు



లారీ ఢీకొనడంతో దెబ్బతిన్న బస్సు - తీవ్రంగా గాయపడ్డ సర్పంచు షర్మిల, సుబ్బయ్య

పెళ్లకూరు, మార్చి 2:పెళ్లకూరు మండల పరిధిలోని టెంకాయతోపు వద్ద 71వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన ప్రమాదంలో 35 మంది గాయపడ్డారు.పోలీసుల కథనం మేరకు...నెల్లూరు జిల్లా రాపూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నెల్లూరు నుంచి తిరుపతికి 55మంది ప్రయాణికులతో బయలు దేరింది. శ్రీకాళహస్తి నుంచి నాయుడుపేట వైపు వస్తున్న లారీ ఈ బస్సును ఎదురుగా వేగంగా ఢీనడంతో బస్సు డ్రైవర్ రవీంద్రతో పాటు 35మందికి గాయాలయ్యాయి.పాలచ్చూరు సర్పంచు పెళ్లూరు షర్మిల, పైడాం వెంకటసుబ్బయ్య, పొదలకూరు మండలం చాడగుట్ల గ్రామానికి చెందిన కలివేటి సుబ్బయ్య, మణికుమారి తదితరులకు తీవ్రగాయాలవడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హథీరాంజీ మఠం భూములు కొని మోసపోవద్దు

ఎప్పటికైనా ఆక్రమణలను తొలగిస్తాం - మఠం ఫిట్‌పర్సన్ రమేష్‌నాయుడు

తిరుమల, మార్చి2(ఆంధ్రజ్యోతి):ప్రజలెవరూ హథీరాంజీ మఠానికి చెందిన భూములు సంబంధం లేని వ్యక్తుల వద్ద కొనుగోలు చేసి మోసపోవద్దని మఠం ఫిట్‌పర్సన్ రమేష్‌నాయుడు సూచించారు. తిరుమలలోని హథీరాంజీ మఠంలో సీజ్ చేసి ఉన్న మహంతు గదిని శనివారం ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సత్యవతి, జిల్లా ఎండోమెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, మఠం తాత్కాలిక మహంతు ఓం ప్రకాష్ దాస్ తదితరులతో కలిసి రమేష్ నాయుడు తెరిచారు.లోపలున్న కొన్ని వస్తువులను స్వాధీన పరుచుకున్నారు. అనంతరం రమేష్ నాయుడు మీడియాతో మాట్లాడారు.ఇటీవల మఠానికి తాత్కాలిక మహంతుగా నియమితుడైన ప్రకాష్‌దాస్‌కు నివాసం కోసమే గది తెరిచామన్నారు. మఠం భూముల్లోని ఆక్రమణలను తొలగించే విషయంలో తిరుపతి ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోందన్నారు.ఆక్రమణలు తొలగించేందుకు తీసుకువెళ్లే పొక్లయినర్ ముందు కూర్చోవడంతో పాటు తమపై దౌర్జన్యం చేస్తున్నారన్నారు.ఇకనైనా తక్కువ రేటుకు వస్తున్నాయని కష్టపడి సంపాదించిన డబ్బును సంబంధం లేని వ్యక్తులకు ఇచ్చి మఠం భూములు కొనుగోలు చేయవద్దని సూచించారు. ఏరోజుకైనా మఠం భూములను స్వాధీనపరుచుకోవడంతో పాటు అందులోని కట్టడాలను కూల్చివేస్తామని హెచ్చరించారు.మఠానికి చెందిన భూములపై ధార్మిక పరిషత్ ప్రత్యేక సర్వే టీంను ఏర్పాటు చేసిందన్న ఆయన కబ్జాలో వున్న శాశ్వత నిర్మాణాలపై త్వరలో ఓ నిర్ణయం తీసుకుంటుందన్నారు.మఠానికి గతంలో మహంత్‌గా ఉండి సస్పెండైన అర్జున్‌దాస్ తప్పించుకు తిరుగుతున్నారన్నారు.ధార్మిక పరిషత్ ఏర్పాటు చేసిన విచారణ కమిటీకి కూడా సహకరించలేదన్నారు. ఈ క్రమంలో కమిటీ అందజేసిన నివేదిక ఆధారంగా అర్జున్‌దాస్‌ను శాశ్వతంగా తొలగించినట్టు తెలిపారు. ఇకపై మఠానికి, ఆయనకు ఎలాంటి సంబంధం లేదన్నారు.అనధికారికంగా మఠం భూములను ఓ ప్రైవేట్ సంస్థకు లీజుకు ఇచ్చేందుకు ఎంఓయూ కుదుర్చుకున్న ఆయన బంధుమిత్రులను మఠాల్లో వివిధ పోస్టుల్లో నియమించారన్నారు.మఠం నిధులను కూడా దుర్వినియోగం చేశారన్నారు.

ధర్మ పోరాట సభకు అనుమతులున్నాయ్

బీసీవై జాతీయ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్

పుంగనూరు, మార్చి 2: పుంగనూరులో ఆదివారం నిర్వహించనున్న ధర్మపోరాట సభకు అన్ని అనుమతులు ఉన్నాయని బీసీవై జాతీయ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ పేర్కొన్నారు. సభ నిర్వహణకు న్యాయస్థానం నుంచి అనుమతి తెచ్చుకున్నాక పలమనేరు డీఎస్పీ మహేశ్వరరెడ్డికి లేఖ రాశామన్నారు. కొన్ని నిబంధనలతో డీఎస్పీ ఈ సభకు అనుమతి ఇచ్చారని వివరించారు.

మీటింగు అంటే పోలీసు 30 యాక్టే.. : శనివారం పలమనేరులో జరిగిన మీడియా సమావేశంలో పలమనేరు సబ్‌డివిజన్‌లో మార్చి ఒకటో తేది నుంచి నెలాఖరువరకు పోలీసు 30 యాక్టు ఉంటుందని.. మార్చి రెండోతేది ఆదేశాలు జారీ చేసినట్లు డీఎస్పీ వివరించారు. గతంలో రామచంద్రయాదవ్ సదుంలో రెండుమార్లు రైతుభేరి బహిరంగ సభ, చదళ్ల వద్ద బీసీవై ధర్మపోరాట సభ, పుంగనూరులో మెగా జాబ్ మేళా నిర్వహించడానికి ముందురోజు పోలీసు 30 యాక్టును అమలులోకి తేవడం, యాదవ్ పర్యటనల్లో కూడా ఇలాగే చేస్తూ అడ్డుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయి.

సూర్య, చంద్రప్రభ వాహనాలపై కపిలేశ్వరుడు



సూర్యప్రభ వాహనంలో కపిలేశ్వర స్వామి

తిరుపతి (కల్చరల్), మార్చి 2: కపిలేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజైన శనివారం ఉదయం స్వామివారు సూర్యప్రభ వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. భజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ పట్టణవీధుల్లో వాహన సేవ నిర్వహించారు. అనంతరం ఆలయంలో సోమస్కందస్వామి, కామాక్షి అమ్మవార్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు చంద్రప్రభ వాహన సేవ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ డిప్యూటి ఈవో దేవేంద్రబాబు, ఏఈవో సుబ్బరాజు, సూపరింటెండెంట్ భూపతి, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అలిపిరి వద్ద కిక్కిరిసిన వాహనాలు



తిరుమల, మార్చి2(ఆంధ్రజ్యోతి): తిరుమలకు ప్రవేశమార్గమైన అలిపిరి చెక్‌పాయింట్‌లో శనివారం వాహనాలు కిక్కిరిసిపోయాయి. శని, ఆదివారాలు కావడంతో తిరుమలకు వచ్చే భక్తుల రద్దీ పెరిగింది. ఈ క్రమంలో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అలిపిరి వాహనాలతో కిటకిటలాడింది. 30 నిమిషాల నుంచి గంట పాటు అలిపిరిలోనే వాహనదారులు నిరీక్షించాల్సి వచ్చింది. వాహనాలు భారీగా నిలిచిపోవడంతో భద్రతా సిబ్బంది తనిఖీలను వేగవంతం చేశారు. మధ్యాహ్నం తర్వాత రద్దీ తగ్గింది.

పురాణాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించండి

సేవా టికెట్‌తో పాటు గది బుక్‌చేసుకునే అవకాశమివ్వండి - డయల్ యువర్ టీటీడీ ఈవోలో భక్తులు



తిరుమల, మార్చి2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పురాణాలపై పోటీలు నిర్వహిస్తే భక్తిభావం పెరుగుతుందని నిఖిలేష్(నెల్లూరు), దర్శనం, సేవా టికెట్లతో పాటు గదిని కూడా బుక్ చేసుకునే అవకాశమివ్వాలని నాగేంద్ర(గుంటూరు) ఈవో ధర్మారెడ్డికి సూచించారు. ఈవో స్పందిస్తూ.. విద్యార్థులకు భగవద్గీత, అన్నమయ్య, వెంగమాంబ సంకీర్తనలపై పోటీలు నిర్వహించి శ్రీవారి దర్శనం కల్పిస్తున్నామన్నారు. పురాణాలపై పోటీలను పరిశీలిస్తామన్నారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో అడ్వాన్స్ బుకింగ్ ద్వారా దర్శనం, సేవా టికెట్లు పొందిన భక్తులకు వసతి కూడా అందుబాటులోకి వస్తుందని వివరించారు. తిరుమల అన్నమయ్య భవనంలో శనివారం డయల్ యువర్ ఈవో కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి 28 మంది భక్తులు ఈవోతో నేరుగా ఫోన్‌లో మాట్లాడారు. లడ్డూలు రెండే ఇస్తున్నారని, ప్రతి భక్తుడికీ 10 ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని రామలక్ష్మి(నంద్యాల) విజ్ఞప్తి చేయగా సాధారణ రోజుల్లో కోరినన్ని లడ్డూలు విక్రయిస్తున్నామన్నారు. బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి వంటి పర్వదినాల్లో మాత్రమే పరిమిత లడ్డూలు అందజేస్తున్నామన్నారు. ఆలయం ముందున్న టీటీడీ బుక్‌స్టాల్‌లో రూ.111 విలువ కలిగిన గోవింద నామాల పుస్తకాన్ని అడిగితే అక్కడ సిబ్బంది బలవంతంగా రూ.150 చొప్పున రెండు పుస్తకాలు విక్రయించారని ఫిర్యాదు చేశారు. పరిశీలించి విధుల్లో ఉన్న సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఈవో బదులిచ్చారు. శ్రీవారిని దగ్గరగా చూసే అవకాశమివ్వాలని సుధాకర్(గుంతకల్), రవీంద్ర (హైదరాబాద్) కోరారు. వీఐపీ సిఫార్సులు, శ్రీవాణి ట్రస్టు ద్వారా బ్రేక్ దర్శన టికెట్లతో దర్శనం చేసుకోవచ్చని సూచించారు. తిరుపతి నుంచి తిరుమలకు నామమాత్రపు ధరలకు టీటీడీ బస్సులను నడిపితే బాగుంటుందని వెంకటేష్(హైదరాబాద్) సూచన చేయగా సాధ్యం కాదని ఈవో స్పష్టం చేశారు.

లక్షలు వెచ్చించినా నెరవేరని లక్ష్యం

● నిరుపయోగంగా డంపింగ్ యార్డులు ● కొన్నిచోట్ల భవనాల రేకులు, తలుపులు అపహరించుకుని వెళ్లిన వైనం



సాకిరేవుపల్లె డంపింగ్ యార్డు రేకులు, తలుపులు అపహరించుకుపోయిన దృశ్యాలు



పిచ్చిమొక్కల మధ్య నిరుపయోగంగా మారిన మాధవరంపల్లె గ్రామ డంపింగ్ యార్డు

వాల్మీకిపురం, మార్చి2: చెత్త నుంచి సంపద సృష్టించేందుకు గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన డంపింగ్ యార్డులు లక్షలు వెచ్చించి నిర్మించినా నేడు వాటి లక్ష్యం నెరవేరకపోగా నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. కొన్ని చోట్ల డంపింగ్ యార్డు భవనాల రేకులు, తలుపులను కొందరు దొంగలించుకుపోవడం ఒకింత ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. వాల్మీకిపురం మండలంలోని టి.సాకిరేవుపల్లె, మాధవరం పల్లె గ్రామ పంచాయతీలకు సంబంధించి 2017వ సంవత్సరంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా డంపింగ్ యార్డులను నిర్మించారు. ఒక్కో డంపింగ్ యార్డు సుమారు రూ.3.40 లక్షలతో నిర్మించి చెత్త సేకరణ కేంద్రాలు ఆ గ్రామాలలో పారిశుధ్యం మెరుగు కోసం ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం డంపింగ్ యార్డులు శిథిలావస్థను తలపిస్తున్నాయి. ఈ నిర్మాణాలు కూడా తమ గ్రామాలలో ఎందుకు ఏర్పాటు చేశారో ఆ గ్రామాల ప్రజలకు కనీస అవగాహన లేకపోవడం గమనార్హం. టి.సాకిరేవుపల్లెకు గ్రామ పంచాయతీకి చెందిన డంపింగ్ యార్డులో అయితే పైకప్పుడు రేకులు, తలుపులు, కిటికీలు సైతం దుండగులు అపహరించుకుపోయారు. ఎటు చూసినా దుర్గంధం, మద్యం సీసాలు తప్ప చెత్త సేకరణ ఛాయలు మాత్రం కని పించడం లేదు. అలాగే మాధవరంపల్లె డంపింగ్ యార్డు నిరుపయోగంగా దర్శనమిస్తూ అందరినీ వెక్కరిస్తోంది. ప్రస్తుత ప్రభుత్వంలో డంపింగ్ యార్డులకు రంగులు వేసుకుని సొమ్ము చేసుకున్నారే తప్ప వాటి ఉపయోగం మాత్రం కనిపించడంలేదు.. డంపింగ్ యార్డులు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ అధికారులు కూడా గత మూడు సంవత్సరాలుగా డంపింగ్ యార్డులను పట్టించుకున్న దాఖలాలు లేవంటున్నారు. ప్రచార ఆర్భాటాలు చేసే వైసీపీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి సారించడం లేదనడానికి ఈ డంపింగ్ యార్డులే నిదర్శనమని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు డంపింగ్ యార్డుల పట్ల దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

పరిశీలించి పరిష్కరిస్తాం..

వాల్మీకిపురం మండలంలోని గ్రామ పంచాయతీల పరిధిలో ఉండే డంపింగ్ యార్డులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యలన్నింటినీ పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. గ్రామీణ ప్రాంతాలలో పారిశుధ్యం మెరుగు కోసం ఏర్పాటు చేసిన చెత్త సేవకరణ కేంద్రాలను అభివృద్ధి చేయడంతో పాటుగా వినియోగంలోకి తేవడం జరుగుతుంది. ప్రభుత్వ భవనాల ప్రాంతంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవు. ఇకపై నిత్యం నిఘా పెట్టడం జరుగుతుంది.
-సుధాకర్‌రెడ్డి, ఎంపీడీవో, వాల్మీకిపురం

అటవీ అధికారుల నిర్లక్ష్యం.. రైతుకు, వ్యాపారికి నష్టం

● అదుపులో టేకు కొయ్యల లారీ



మదనపల్లె అటవీశాఖ కార్యాలయం వద్ద ఉన్న టేకు కొయ్యల లారీ

మదనపల్లె టౌన్, మార్చి 2: అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఓ రైతుతో పాటు వ్యాపారి నష్టపోతున్నారు. అటవీశాఖ మండల స్థాయి అధికారులు సక్రమంగా విధులు నిర్వహించి ఉంటే తమకు ఈ నష్టం, బాధ ఉండేవి కావని బాధితులు వాపోతున్నారు. దీంతో సుమారు 20 టన్నుల బరువైన టేకు కొయ్యలు తీసుకెళ్తున్న లారీ మదనపల్లె అటవీశాఖ కార్యాలయం వద్ద మగ్గుతోంది. వివరాల్లోకి వెళితే..నిమ్మనపల్లె మండలం అగ్రహారం గ్రామానికి చెందిన రైతు మునికృష్ణయ్య తన పట్టా పొలంలో టేకు చెట్లను పెంచాడు. ఈ చెట్లు పెద్దవి కావడంతో తమిళనాడుకు చెందిన ఓ వ్యాపారికి విక్రయించాడు. నిబంధనల ప్రకారం రైతు మునికృష్ణయ్య టేకు చెట్లకు కట్టింగ్ ఆర్డర్, రవాణా పర్మిట్ల కోసం దరఖాస్తు చేసుకోగా వాల్మీకిపురం అటవీసెక్షన్ అధికారులు అగ్రహారం వెళ్లి విచారించి ఎఫ్ఆర్‌వో ద్వారా రాజంపేట డీఎఫ్‌వోకు నివేదికలు పంపారు. దీంతో డీఎఫ్‌వో నుంచి 80 దాకా టేకు చెట్లకు కట్టింగ్ ఆర్డర్‌తో పాటు ఐదు రవాణా పర్మిట్లు జారీ చేశారు. ఈ క్రమంలో బుధవారం అగ్రహారం నుంచి టేకు కొయ్యలు లోడు చేసుకుని వస్తున్న లారీని పీలేరు అటవీశాఖ స్క్వాడ్ డీఎఫ్‌లో సుబ్బారెడ్డి తనిఖీ చేసి పర్మిట్‌లో వున్న బరువు కన్నా అధికంగా టేకు కొయ్యలు లోడు చేసుకుని వెళ్తున్నట్లు అనుమానించి లారీని అదుపులోకి తీసుకుని మదనపల్లె అటవీశాఖ కార్యాలయంలో అప్పగించారు. దీనిపై కేసు రాసి ఉన్నతాధికారులకు పంపారు. వాస్తవంగా టేకు కొయ్యలు కట్టింగ్ చేసి లారీకి లోడు చేసే సమయంలో పర్మిట్‌లో వున్న టేకుకొయ్యల బరువు వరకే లారీకి లోడు చేయించాల్సిన బాధ్యత స్థానిక అటవీశాఖ అధికారులకు వుంది. కాని టేకు కొయ్యలను లారీకి లోడు చేసే సమయంలో అటవీ శాఖ అధికారులు అక్కడ లేకపోవడంతో వ్యాపారి పర్మిట్ కన్నా ఎక్కువగా టేకు కొయ్యలు లారికి ఎక్కించి తరలిస్తుండగా పీలేరు స్క్వాడ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. దీనిపై పీలేరు స్క్వాడ్ డీఎఫ్‌వో సుబ్బారెడ్డి మాట్లాడుతూ పరిమితికి మించి టేకు కొయ్యలు రవాణా చేస్తున్నట్లు సమాచారం అందడంతో తాము టేకు కొయ్యల లారీని అదుపులోకి తీసుకున్నామన్నారు.

తండ్రీ, కూతురు అదృశ్యం..కేసు నమోదు

నిమ్మనపల్లి, మార్చి 2: తండ్రీ కూతురు అదృశ్యం కావడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ సత్యసాయి జిల్లా తనకల్లు మండలం తవళం పంచాయతి కుమరవాండ్లపల్లికి చెందిన ఫిర్యాదు దారుడు విజయబాస్కర్‌రెడ్డి వివరాలిలావున్నాయి. తన భార్య రెడ్డిరాణి(27)తో కలిసి వైద్యపరీక్షల నిమిత్తం మదనపల్లి వచ్చామన్నారు. అయితే తన భార్య రెడ్డిరాణి అదేరోజు తన స్వగ్రామమైన నిమ్మనపల్లి మండలం అగ్రహారం పంచాయతి రెడ్డివారిపల్లె వెళ్లినట్లు తెలిపారు. వెంటనే ఫోన్ చేసి తన భార్య గురించి అడుగగా ఆమె గ్రామానికి వచ్చి తన తండ్రి రెడ్డెప్పరెడ్డి(62)తో కలసి ఆటో వెళుతున్నట్లు తెలిపారు. అనంతరం రెడ్డిరాణి సెల్ ఫోన్ నుంచి వాట్సప్ ద్వారా తనని వెతికి పట్టుకొన్నా మరళా ఆత్మహత్య చేసుకొంటానని దీనికి అంతటి కారణం తమ ధాయాదులేనని వారు తనకు రావలసిన భూమి ఇవ్వనందుకు వెళుతున్నట్లు తన తండ్రి మోహన్‌రెడ్డికి సమాచారం పంపిందన్నారు. దీంతో భర్త విజయబాస్కర్‌రెడ్డి మునసటిరోజు రెడ్డివారిపల్లిలో విచారించగా భార్య రెడ్డిరాణి, మామ రెడ్డెప్పరెడ్డి కనిపించలేదని గ్రామస్థులు తెలుపడంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. ఆమేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు.

11 మంది జూదరుల అరెస్టు

గుర్రంకొండ, మార్చి 2:జూదరులపై పోలీసులు దాడి చేసి 11 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ సూరప్పగారిపల్లెలో జూదం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 11 మంది పట్టుబడగా వారి వద్ద నుంచి రూ.10,800 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

రాత్రికి రాత్రే ఇసుక మాయం ఉదాసీనంగా అధికారులు



: తురకపల్లె ఈద్గా సమీపంలోని డంపు నుంచి రాత్రికి రాత్రే మాయమైన ఇసుక నిల్వలు

మదనపల్లె టౌన్, మార్చి 2: ఇసుక ఎవరు తరలిస్తే మాకెందుకు..మాకు సంబంధం లేని మ్యాటర్‌లో మేమెందుకు తలదూర్చాలి అన్నట్లుగా ప్రభుత్వ అధికారులు ఉదాసీనంగా ఉండటంతో శుక్రవారం రాత్రికి రాత్రే 100 టన్నుల ఇసుక మాయం అయిపోయింది. మదనపల్లె పట్టణ శివారులోని సీటీఎం రోడ్డు తురకపల్లె ఈద్గా వద్ద, బెంగళూరు రోడ్డులోని చిప్పిలి గ్రామం వద్ద ఒక్కో చోట 50 ట్రాక్టర్ల ఇసుకను అక్రమంగా డంపింగ్ చేసి, రాత్రి పూట స్మగ్లింగ్ చేస్తున్న విషయాన్ని శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' బయట పెట్టింది. దీనిపై అటు రెవెన్యూ అధికారులు కాని, ఇటు ఎస్ఈబీ అధికారులు కాని దృష్టి పెట్టింది లేదు. ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాల్సిన మైనింగ్ అధికారుల ఊసే అసలు లేదు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం చీకటి పడగానే స్మగ్లర్లు రెచ్చిపోయారు. ఏకంగా ఐదు ట్రిప్పర్లను పెట్టి ఎక్స్‌వేటర్‌తో నిల్వచేసిన ఇసుక డంపుల నుంచి లోడ్ చేసి పట్టణంలోని పలు చోట్లకు తరలించేశారు. బహిరంగంగా ఇసుకను తరలిస్తున్నా పట్టించుకున్న నాధుడే లేడు. దీంతో సుమారు 100 టన్నుల ఇసుక రాత్రికి రాత్రే డంపుల వద్ద నుంచి మాయమైపోయింది. దీని వెనుక అసలు సూత్రధారి ఎవరున్నారో అని ప్రజలు చెవులు కొరుక్కుంటున్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు మృతి



మయూరనాథ్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీనాథరెడ్డి

రామసముద్రం, మార్చి 2: రామసముద్రం మండల టీడీపీ సీనియర్ నాయకుడు స్థానికం మయూరనాథ్‌రెడ్డి(85) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. టీడీపీలో క్రియాశీలకంగా ఉంటూ సర్పంచ్‌గా, ఎంపీటీసీ పనిచేశారు. ఇతని భార్య వసుమతమ్మ ఎంపీపీగా పనిచేశారు. మయూరనాథ్ మృతిపట్ల పార్టీలకు అతీతంగా పలువురు నాయకులు సంతాపం తెలిపారు. టీడీపీ నాయకులు నల్లారి తిమ్మారెడ్డి, కెళవాతి శ్రీనాథరెడ్డి, దొమ్మలపాటి యశస్విరాజ్, మండల పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడు, మాజీ అధ్యక్షుడు కొండూరు నారాయణరెడ్డి, మాజీ జడ్పీటీసీలు మునివెం కటస్వామి, శివశంకర్, గజ్జల సీతప్ప, మైనార్టీ నాయకులు ఒంటెల అల్తాఫ్, జనసేన నాయకులు రామదాసుచౌదరి, పుర ప్రముఖులు, అధిక సంఖ్యలో ప్రజలు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రజల ఆశీర్వాదం కోసమే విజయసంకల్ప యాత్ర

● తంబళ్లపల్లె టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి



సూపర్‌సిక్స్ కరపత్రాలను వివరిస్తున్న జయచంద్రారెడ్డి

బి.కొత్తకోట, మార్చి2: రానున్న ఎన్నికలలో ప్రజల ఆశీర్వాదం పొందడం కోసమే విజయసంకల్పయాత్ర కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతోందని తంబళ్లపల్లె టీడీపీ అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని గట్టు పంచాయతీ పరిధిలో విజయ సంకల్పయాత్రలో భాగంగా ఆయన పర్యటించి ఇంటింటికీ తిరిగి పార్టీ మ్యానిపెస్టోలోని ఆరు గ్యారెంటీల కరపత్రాలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధోగతి పాలైన రాష్ట్ర పునర్నిర్మాణం కోసం, అరాచక వైసీపీ పాలనను అంతమొందించడం కోసం ప్రతి ఒక్కరూ టీడీపీకి మద్దతుగా నిలిచి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికలలో టీడీపీ-జనసేనలకు అండగా నిలవాలని ఓటర్లను అభ్యర్థించారు. అంతకు మునుపు జయచంద్రారెడ్డి కి గ్రామంలో ఘనస్వాగతం లభించింది. స్థానిక వెంకట్రమణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నేత పోతుల సాయినాథ్, మండల కన్వీనర్ నారాయణస్వామి, నాయకులు అంగజాల రాజన్న, అనసూయమ్మ, చావిడి కిట్టన్న, శిద్దారెడ్డి, మాబు, వెంకటనారాయణ, రెడ్డెప్ప, లక్ష్మీపతి, గంజి మోహన తదితరులు పాల్గొన్నారు.

యువత ఓటుతో జగన్‌కు బుద్ధి చెప్పాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న తెలుగు యువత ప్రధాన కార్యదర్శి అయూబ్‌బాషా, టిఎన్ఎస్ఎఫ్ ప్రతినిధి రమేష్ తదితరులు

కురబలకోట, మార్చి 2: యువత ఓటుతో సీఎం జగన్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని రాజంపేట పార్లమెంటరీ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి అయూబ్‌బాషా, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్పూరీ రమేష్‌లు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని అంగళ్ళులో ఓట్ ఫర్ సీబీఎన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్‌ను కాపాడే బాధ్యత విద్యార్థుల చేతుల్లోనే ఉందన్నారు. అసమర్థుడు సీఎం జగన్ కావడం చేత యువత ఉద్యోగాలు, ఉపాధి కోల్పోయారని ఆరోపించారు. ఐదేళ్ల ఆయన పాలనలో విద్యావ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. రాబోవు ఎన్నికలలో టీడీపీకి పట్టం కట్టి రాష్ట్రాభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో నజీబ్, శివకుమార్, షామీర్, బాలకృష్ణారెడ్డి, సూరి, జీవరత్నం, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ నిర్మూలనే లక్ష్యంగా పనిచేస్తాం

మదనపల్లె టౌన్, మార్చి 2: మదనపల్లె ప్రాంతంలో నిరుద్యోగ నిర్మూలనే లక్ష్యంగా పనిచేస్తామని టీడీపీ నాయకుడు నాగూర్‌వలి పేర్కొన్నారు. శనివారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సూచనలతో టీడీపీ నాయకులు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగూర్‌వలి మాట్లాడుతూ మదనపల్లె ప్రాంతంలో టెన్త్ నుంచి పీజీ చదివిన అభ్యర్థులు ఎంతో మంది ఉద్యోగాల కోసం వెతుకుతున్నారన్నారు. అందుకే డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులకు భవిష్యత్‌లో ఉద్యోగావకాశాల కోసం బెంగళూరుకు చెందిన ఆషిక్‌తో కలసి ఇంటర్వ్యూలు నిర్వహించారు. వాక్ ఇన్ ఇంటర్వ్యూకు సహకరించిన జ్ఞానాంబిక కరస్పాండెంట్ గురుప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు టీడీపీ జనసేన శ్రేణులతో విస్తృత స్థాయి సమావేశం

కలికిరి, మార్చి 2: పీలేరు నియోజకవర్గానికి సంబంధించిన టీడీపీ, జనసేన శ్రేణులతో విస్తృత స్థాయి సమావేశం ఆదివారం ఏర్పాటు చేస్తున్నట్లు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు నగరిపల్లెలో ఈ సమావేశం జరుగుతుందని చెప్పారు. నియోజకవర్గానికి చెందిన ఆరు మండలాల నుంచి టీడీపీ, జనసేన ముఖ్య నాయకులు టీడీపీ క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జీలు, బూత్ కన్వీనర్లు, బూత్ ఏజెంట్లు, గ్రామ కమిటీ అధ్యక్షులు, టీడీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, సభ్యులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, నల్లారి కుటుంబ అభిమానులు, జనసేన మండల, గ్రామ స్థాయి నాయకులు, పవన్ కల్యాణ్ అభిమానులు తప్పనిసరిగా హాజరు కావాలని కిశోర్‌కుమార్ రెడ్డి కోరారు.

వేడుకగా సిద్ధేశ్వరుని బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు ఉత్సవాలకు ముస్తాబైన సిద్ధేశ్వరాలయం

కలకడ, మార్చి 2: కలకడ సత్యవతి నదీతీ రాన వెలసిన కామాక్షీ సమేత సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం వేడుకగా అంకురార్పణ నిర్వహించారు. అర్చకులు విజయసారథి, సుబ్రమణ్యం స్వామి, మహేష్ ఆధ్వర్యంలో గణపతి పూజ, స్వస్తిపుణ్యావాచనం, పంచగవ్యప్రాశన , దీక్ష స్వీకరణ, రక్షాబంధన, మృత్సంగ్రహము, అంకురార్పణం, వాస్తు హోమం, వాస్తు పూజ, ధ్వజారోహణం చేశారు.కామాక్షీ సమేత సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 3న ధ్వజారోహణం, శేషవాహనం, 4 రావణ వాహనం, 5న హంస వాహనం, 6న మయూర వాహనం, 7న కల్యాణోత్సవం, గజవాహనంపై స్వామి, అమ్మవార్ల ఊరేగింపు ఉంటాయని ఆలయ ధర్మకర్త కేసర్ల అఖిలేష్ తెలిపారు. అలాగే 8వ తేది మహాశివరాత్రి పర్వదినం రోజున శిఖరదీపదర్శనం, రుద్రాభిషేకం, వృషభవాహనం, లక్షబిల్వార్చన కార్యక్రమాలుంటాయని తెలిపారు. 9న ఝరి ఉత్సవం, యాళివాహనం, 10న త్రినేత్రధారణ, మహానివేదన, రథోత్సవం, తోటోత్సవం, 11న వసంతోత్సవం, త్రిశూల స్నానం, సింహవాహనం, 12న పార్వేట, అశ్వవాహనం, 13న ధ్వజావరోహణం, ఊంజలసేవ కార్యక్రమాలు ఉంటాయన్నారు.. ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. మహా శివరాత్రి పర్వదినం రోజు రాత్రి జాగరణ చేసే భక్తుల సౌకర్యార్థం ఆలయం చుట్టూ షామియానాలు ఏర్పాటు చేస్తున్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు కె.శ్రీనివాసప్రసాద్, మద్దిపట్ల వెకటరమణ నాయుడు, రెడ్డెప్పనాయుడు పాల్గొన్నారు.

మల్లయ్యకొండకు హుండీ ద్వారా రూ. 5 లక్షలు ఆదాయం

తంబళ్లపల్లె మార్చి 2 : తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్యకొండ ఆలయానికి భక్తులు సమర్పించిన హుండీ కానుకల ద్వారా రూ. 5,01,243 లు ఆదాయం వచ్చినట్లు ఈవో రమణ తెలిపారు. శనివారం మల్లయ్యకొండ పైన ఆలయంలో ఈవో, ఛైర్మన్ కే.ఆర్ మల్‌రెడ్డి, పాలక మండలి సభ్యులు ఆధ్వర్యంలో హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని చేపట్టారు. డిసెంబర్ 14 నుంచి ఈనెల 2 వరకు హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా రూ 5,01,243 ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు, దేవదాయ శాఖ అధికారులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నరసింహస్వామికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, మార్చి 2:మండలంలోని తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమలో అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్ కోసం సంప్రదించండి

● ఉమ్మడి చిత్తూరు జిల్లా సీఎస్‌సీ మేనేజర్ సతీష్‌కుమార్

పెద్దతిప్పసముద్రం మార్చి 2 :సోలార్ విద్యుత్ ఏర్పాటు కోసం సంప్రదించవచ్చని ఉమ్మడి చిత్తూరు జిల్లా సీఎస్‌సీ మేనేజర్ సతీష్ కుమార్ వెల్లడించారు. సూర్యగుర్ యోజన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఈ పథకం ద్వారా ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకుంటే గృహ వినియోగదారులను సౌర విద్యుత్ వినియోగం వైపు ప్రోత్సహించి, మామూలు కరెంట్ వినియోగం తగ్గించి సౌర విద్యుత్‌ను వినియోగించేందుకు అవకాశం కల్పించిందన్నారు. సోలార్‌కు కేంద్ర ప్రభుత్వం ఇంటిపైనే ఏర్పాటు చేసుకునే సామర్థ్యాన్ని బట్టి రాయితీ ఉంటుందన్నారు. సోలార్ కావాలనుకునే వారు 9014632647 నంబర్‌కు సంప్రదించవచ్చన్నారు.

నేడు వాల్మీకుల రాష్ట్రస్థాయి సమావేశం

మదనపల్లె అర్బన్, మార్చి 2:మదనపల్లెలో వాల్మీకుల రాష్ట్రస్థాయి రౌండ్‌టేబుల్ సమావేశం స్థానిక అయోధ్యనగరలో ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఏపీ వాల్మీకి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పులి శ్రీనివాసులు తెలిపారు. వాల్మీకి ఎస్టీ రిజర్వేషన్ సాధించడానికి, రాజకీయ చైతన్యం తీసుకురావడానికి రాష్ట్రస్థాయి రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. సమావేశాన్ని వాల్మీకి కుటుంబసభ్యులు అందరూ హాజరై విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఇన్నోవేషన్‌పై అవగాహన పెంచుకోవాలి

మదనపల్లె టౌన్, మార్చి 1: ఇంజినీరింగ్ విద్యార్థులు ఇన్నోవేషన్‌పై అవగాహన పెంచుకోవాలని తిరుపతి ఐఐటీ మెకానికల్ ఇంజినీరింగ్ హెచ్‌వోడీ ప్రొఫసర్ ఎం.రవిశంకర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో నాలుగు రోజుల పాటు నిర్వహించే డిజైన్ థింకింగ్ ఇన్నోవేషన్ వర్క్‌షాపును ఆయన ప్రారంభించారు. ప్రతి ఇంజినీరింగ్ విద్యార్థి సమాజానికి ఉపయోగపడే వినూత్న డిజైన్లను ప్రయోగాత్మకంగా కనుగొని వాటిని ఆవిష్కరించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రామలింగారెడ్డి, మెకానికల్ హెచ్‌వోడీ వీవీఎస్ భాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ పాలనలో రైతు సంక్షేమానికి పెద్ద పీట



టీడీపీ పథకాలను ప్రజలకు వివరిస్తున్న నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి

కలకడ, మార్చి 2:టీడీపీ పాలనలో రైతు సంక్షేమానికి పెద్ద పీట వేసి అనేక పథకాలను ప్రవేశపెట్టిందని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బాబు ష్యూరిటీ..భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా శనివారం కలకడ మండలంలోని ఎనుగొండపాలెం పంచాయతీ గుండావాండ్లపల్లె, దిగువపాలెం, గొల్లపల్లె తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి టీడీపీ మినీ మేనిఫెస్టో, సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం వైసీపీ నేతృత్వంలో అరాచకపాలను నుడుస్తోందని రానున్న ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి టీడీపీకి బ్రహ్మరథం పట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికారప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాశ్, దగ్గుబాటి వెంకటేశ్వరరావు, తిరుపతినాయుడు, శేఖర్‌నాయుడు, కేశవులనాయుడు, శ్రీనివాసులనాయుడు, కోట రమణనాయుడు, వెంకటమల్లప్పనాయుడు, బత్తల హరి, జిలానీ, ఇర్ఫాన్,రెడ్డెప్పరెడ్డి పాల్గొన్నారు.

పీలేరులో కిశోర్‌కుమార్‌రెడ్డి గెలుపు తథ్యం



నాగంవారిపల్లెలో టీడీపీ, జనసేన నాయకుల ఇంటింటి ప్రచారం దృశ్యం

వాల్మీకిపురం, మార్చి 2: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పీలేరు తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి గెలుపు తథ్యమని వాల్మీకిపురం మండలం టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. శనివారం వాల్మీకిపురం మండలంలోని నాగంవారి పల్లె, దండువారిపల్లె, పత్తేపురం తదితర ప్రాంతాలలో బాబు షూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా టీడీపీ-జనసేన పార్టీల ఉమ్మడి మేనిఫెస్టో పథకాలపై ఇంటింటా కరపత్రాలు పంచుతూ విస్తృత ప్రచారం చేపట్టారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో దాడులు, దౌర్జన్యాలతో అరాచక పరిపాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు చరమగీతం పాడుతారన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావడం, సీఎం జగన్ ఇంటికి పోవడం తథ్యమన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వల్లిగట్ల వెంకటరమణ, జిల్లా పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, టీడీపీ పీలేరు మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ బాషా, రాజంపేట పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజేంద్రాచారి, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు కోసూరి రమేష్, నాయకులు పీవీ నారాయణ, చంద్రమౌళి, తెలుగు యువత చాను, కువైట్ సయ్యద్‌బాషా, అడ్వకేట్ రమణ, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థుల విజయానికి పనిచేస్తాం

● జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు



టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డితో జనసేన నేతలు శ్రీరామ రామాంజనేయులు, అనిత

మదనపల్లె, మార్చి 2: మదనపల్లె, తంబళ్లపల్లె నియోజవర్గాల్లో జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థుల విజయానికి కలసి పనిచేస్తామని మదనపల్లె నియోజకవర్గ జనసేన నేత శ్రీరామ రామాంజనేయలు పేర్కొన్నారు. పార్టీశ్రేణులతో కలసి ఆయన శనివారం తంబళ్లపల్లె ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డిని ములకల చెరువులో కలిశారు. ఇరుపార్టీల అధినేతలు పవన్‌కళ్యాణ్, నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు తామంతా మీ విజయానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో వైసీపీ విముక్త పాలనే ధ్యేయంగా మనందరం కలిసి ముందుకెళ్లాలని రామాంజనేయులు పేర్కొన్నారు. మదనపల్లెతోపాటు తంబళ్లపల్లె నియోజకవర్గంలో జనసేన బలంగా ఉన్నట్లే ఆ సామాజిక వర్గం ఓటర్లు కూడా ఎక్కువగానే ఉన్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి, నాసేనకు నావంతు కమిటీ సభ్యురాలు దారం అనిత, పార్టీ పట్టణ అధ్యక్షుడు నాయని జగదీష్, కుప్పాల శంకర్, అశ్వత్, ధరణి, సోను, హర్ష, శ్రీనాథ్, టి.శివ, రూప పాల్గొన్నారు.

వివేక హత్యకేసులో జగన్ పాత్రపై విచారణ చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు భవానిప్రసాద్

మదనపల్లె టౌన్, మార్చి 2: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీఎం జగన్ పాత్రపై విచారణ చేపట్టాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు భవానిప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ ఆదేశాలతో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో భవానిప్రసాద్ మాట్లాడుతూ 2019 ఎన్నికల ముందు జగన్ వివేకానందరెడ్డి హత్యను రాజకీయ లబ్ధికోసం వాడుకున్నారని విమర్శించారు. వివేక కుమార్తె సునీత చేస్తున్న న్యాయపోరాటానికి ఆమెకు టీడీపీ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. వెంటకే వివేకా హత్య కేసులో నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోడెం సిద్దప్ప, నీలకంఠ, తులసీధర్‌నాయుడు, దుర్గాప్రసాద్, రవీంద్రనాయుడు, సికిందర్ పాల్గొన్నారు.

తంబళ్లపల్లెకు నరసింహారెడ్డికి అవకాశమివ్వండి

మదనపల్లె అర్బన్, మార్చి 2: తంబళ్లపల్లె నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థిగా చల్లపల్లె నరసింహారెడ్డికి అవకాశం కల్పించాలని పలు మండలాల బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మదనపల్లెలోని స్థానిక సొసైటీ కాలనీలో నరసింహారెడ్డి స్వగృహం మీడియా సమావేం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు మండల బీజేపీ నాయకులు మాట్లాడుతూ తంబళ్లపల్లెలో సుపరితులైన, తంబళ్లపల్లె అభివృద్ధిని కాంక్షించే చల్లపల్లె నరసింహారెడ్డికి తంబళ్లపల్లె నియోజకవర్గ అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థిగా అవకాశం కల్పిస్తే బీజేపీ నాయకులు, కార్యకర్తలు అండగా ఉండి గెలిపిస్తామన్నారు. కార్యక్రమంలో ఆరు మండలాల నాయకులు మల్లికార్జున నాయుడు, రాందాస్, కమ్మచెరువు బాషా, శివన్న, బావజాన్, గుణశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, ఈశ్వర్‌రెడ్డి, నరసింహారెడ్డి, నాగరాజ, రామమోహన, లక్ష్మీనారాయణ, శంకరరెడ్డి, మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయసాధన సభ రాజకీయాల్లో మార్పుతెస్తుంది



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ నాయకుడు రెడ్డిసాహెబ్

మదనపల్లె అర్బన్, మార్చి3: తిరుపతిలో నిర్వహించిన న్యాయసాధన సభ రాజకీయాల్లో మార్పు తీసుకొస్తుందని మదనపల్లె నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎస్. రెడ్డిసాహెబ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఇందిరమ్మ రాజ్యం రావాలన్నా, రాష్ట్రంలో ప్రజలు సంక్షేమంగా ఉండాలన్నా కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. తిరుపతిలో రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల సభ విజయవంతం అయినందుకు సహకరించిన రాయలసీమ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు మదనపల్లె కాంగ్రెస్ పార్టీ కమిటీ తరఫున ఆయన కృతజ్ఞతులు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ క్యాడర్ కష్టపడి పార్టీబలోపేతానికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 2024లో రాష్ట్రప్రధానిగా రాహుల్ గాంధీని గెలిపించడమే లక్ష్యంగా అందరూ పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రూరల్ మండల అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, వెంకటరమణ, చలపతి, నాగరాజ, మహమ్మద్ రఫీ, మహబూ బీపీర్, మహమ్మద్‌అలీ, ఈశ్వరమ్మ, సయ్యద్, బయాయరెడ్డి, రవీంద్ర, షంషీర్ పాల్గొన్నారు.

పల్స్ పోలియోకు సర్వం సిద్ధం

పీలేరు, మార్చి 2: మండలంలో ఆదివారం జరగనున్న జాతీయ పల్స్ పోలియో కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తలపుల, రేగళ్ల పీహెచ్‌సీల వైద్యాధికారులు రమేశ్ రెడ్డి, కార్తీక్ కుమార్ తెలిపారు. మండలంలో 0-5 ఏళ్లలోపు 7361 మంది చిన్నారులు ఉన్నారని, వారందరికీ పోలియో చుక్కలు వేసేందుకు 42 కేంద్రాలు, రెండు మొబైల్ టీంలు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. పోలియో ప్రమాదం పూర్తిగా తొలగిపోలేదని, చిన్నారులున్న తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయకుండా విధిగా పోలియో చుక్కలు వేయించాలని వారు విజ్ఞప్తి చేశారు.

కలికిరిలో: చిన్న పిల్లలకు పోలియో నిరోధక వ్యాక్సిన్లు వేసే పల్స్ పోలియో కార్యక్రమం ఆదివారం జరుగనుంది. మండలంలో ఐదేళ్ల లోపు వయసున్న 5466 మంది పిల్లలను అర్హులుగా గుర్తించారు. మొత్తం మండలంలోని 14 పంచాయతీల్లో 35 కేంద్రాలను ఏర్పాటు చేసి ఉదయం 6 గంటల నుంచి పోలియో వ్యాక్సిన్లు వేయనున్నారు. కాగా గతంలో మండలంలోని అన్ని శాఖల అధికారులను, అంగన్‌వాడీ కార్యకర్తలను, రెవెన్యూ, మండల పరిషత్తు అధికారలతో సమన్వయం చేసుకుని విజయవంతంగా కార్యక్రమాన్ని నిర్వహించే వారు. ఈసారి చిన్న పిల్లలకు సంబంధించి కీలకమైన అంగన్‌వాడీ కార్యకర్తలను పల్స్ పోలియోకు దూరంగా ఉంచారు.